# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 21-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:159 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

మళ్లీ మేమే రాజులం
మత రాజ్యానికి దాసులం
వికసిత భారత శ్వాసులం
విస్తృత ప్రజలకు భాసులం.

ఏదేమైనా ఏకస్వామం
ఏలికే దేశం ఇక ఖాయం
మిన్నకఉంటే ప్రజాస్వామ్యం
మనుగడే అంతా మాయం



-వేల్పుల నారాయణ
9440433475

## తెలంగాణలో 3 రాజ్యసభ స్థానాల్లో అభ్యర్థులు ఏకగ్రీవం

హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో 3 రాజ్యసభ స్థానాల్లో అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యాయి. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ అధికారులు వివరాలు వెల్లడించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు 2, బీఆర్ఎస్ పార్టీకి ఒక స్థానం దక్కనుంది. రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు సభ్యులకు రిటర్నింగ్ ఆఫీసర్ ఉపేందర్ రెడ్డి ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నారు.ఏకగ్రీవం అయిన వారిలో కాంగ్రెస్ నుంచి రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ తరపున వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. ఫిబ్రవరి 15తో ఎన్నికల నామినేషన్ గడువు ముగిసింది. మూడు స్థానాలకు ముగ్గురే నామినేషన్లు వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది

## వాసవి శాంతి థామ్ లో నిర్మలా సీతారామన్ ప్రత్యేక పూజలు



పెనుగొండ, ఫిబ్రవరి 20 : పెనుగొండ క్షేత్రం వాసవి శాంతిథామ్ నందు పంచమ వార్షికోత్సవ మహోత్సవాల్లో ముఖ్య అతిథిగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు అఖిల భారత పెనుగొండ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ గోవిందరాజులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో వాసవిమాతను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వాసవి మాతకు బంగారు కిరీటం ఆవిష్కరణ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ రంగనాథరాజు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో పితాని సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ సునీత్ కుమార్ గాంధీ, తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ఓమో రూమ్స్ రగడ..



హైదరాబాద్, ఫిబ్రవరి 20: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం రెండో రోజు వాడివేడిగా సాగుతోంది. ఇవాళ ఉదయం మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం ప్రారంభమైన వెంటనే కౌన్సిల్ హాల్ లో ఓయో రూమ్స్ రగడ మొదలైంది. ఓయో రూమ్స్ పై కార్పొరేటర్లు హాట్ హాట్ గా మాటల యుద్ధం జరిగింది. రెసిడెన్సియల్ పేరుతో కమర్షియ ల్ నడిపిస్తున్నారని మండిపడ్డారు. ఫ్యామిలీస్ ఉన్న ప్రాంతాల్లో ఓయో బిసినెస్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెసిడెంట్స్ పేరుతో కమర్షల్ బిజినెస్ పేరుతో వ్యాపారం చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓయో రూమ్స్ నిబంధనల పై క్రాస్ చెక్ చెయ్యాలి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్లు ప్రజా సమస్యలను సభలో లేవనెత్తారు. హైదరాబాద్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని కార్పొరేటర్లు అధికారులను నిలదీశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ తక్కువగా ఉన్నాయని, ఫంక్షన్లు ఎక్కువగా ఉన్నాయని కార్పొరేటర్లు చెబుతున్నారు. కార్పొరేటర్లను అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ల పట్ల అధికారులు కుక్కల కంటే హీనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కనీసం అధికారులు ఫోన్లు కూడా ఎత్తడం లేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని కార్పొరేటర్లు ప్రశ్నించారు.

## మహా జాతరలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కట్టడికి పెద్దపీట వెయ్యాలి

### - దేవాదాయ మంత్రి కొండా సురేఖకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి

హైదరాబాదు, ఫిబ్రవరి -20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నేటి నుంచి సమ్మక్క సారక్క మహా జాతర ప్రారంభమవుతున్న సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అత్యంత పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, మహా జాతరలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకానికి తావు లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు ఎస్ సి హెచ్ రంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రత్యేకించి దేవాదాయ-ధర్మాదాయ శాఖను డిమాండ్ చేశారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు సమ్మక్క సారలమ్మ దర్శనార్థం రానున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చిన నేపథ్యంలో ఆ స్థాయిలో మహా జాతర పరిసర ప్రాంతాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ పోగుపడే అవకాశం ఉందని, దాని నియంత్రణకు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. భక్తుల్లో మరింత అవగాహన పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం జాతరకు విచ్చేసే భక్తులకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసలే అటవీ ప్రాంతం అయినందువల్ల మహా జాతర ముగిసిన తరువాత అక్కడ భారీస్థాయిలో పోగుపడే ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి, అటవీ జంతుజాలానికి పెను ప్రమాదాన్ని సృష్టించే అవకాశం ఉందని' అందువల్ల మహా జాతర రోజుల్లో ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ పోగుపడకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు అనివార్యంగా పోగుపడే ప్లాస్టిక్ ను ఎప్పటికప్పుడు సేకరించేందుకు పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖను ఆయన డిమాండ్ చేశారు. భక్తులు కచ్చితంగా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ విధానాలతోనే అమ్మవార్లను దర్శించుకునేలా అధికారులు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తుచేశారు . ఇప్పటికే దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆలయాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ సాధారణ ఆలయాల్లో ఇబ్బడి ముబ్బడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతూనే ఉందని రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఉదాసీనత రాజ్యమేలుతున్న తరుణంలో రెండు కోట్ల మంది భక్తులు రానున్న జాతరలో భారీ స్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పోగుపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కట్టడికి జాతరకు వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆమేరకు ప్రచారం విస్తృతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేటి కందం- నేటికి అందం

జగమంతయు శ్లాఘించగ
నగణిత జ్ఞానమును నింపు నాత్మీయతయై
మగటిమి నందించగ-జరు
పగ వలయును నేడు మాతృభాషా దినమున్

(ఫిబ్రవరి 21 ప్రపంచ మాతృభాషాదినం)



-రాధశ్రీ
సెల్:9494481210

## మార్చి 9వ తేదీ తర్వాత లోక్‌సభ ఎన్నికలు

న్యూ డిల్లీ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం సమాయాత్తమైంది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెల ఈసీ సార్వత్రిక ఎన్నికల నగారా మోగించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. మార్చి 9వ తేదీ తర్వాత లోక్‌సభ ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.కాగా, పార్లమెంట్ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో భాగంగానే ఈసీ బృందం గత కొన్ని రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తోంది.

రాజకీయ పార్టీలు, స్థానిక అధికారులతో సమావేశాలు నిర్వహించిన అధికారులు షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం.వీటితోపాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించాలని ఈసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో మార్చి 8, 9 తేదీల్లో ఈసీ బృంద భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంసిద్ధతను పరిశీలించేందుకు మార్చి 12,13 తేదీల్లో జమ్మూకశ్మీర్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలపై ఒక అంచనాకు రానున్నట్లు తెలుస్తోంది.గతంలోలానే ఈ సారి కూడా ఏప్రిల్ ? మే నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేలా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికలకు 2019 మార్చి 10న షెడ్యూల్ ప్రకటించారు. ఏప్రిల్ 11 నుంచి మే 19వ తేదీ వరకూ ఏడు దశల్లో పోలింగ్ జరిగింది. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించారు.

## త్వరలో రాష్ట్రానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప సభలో పాల్గొనేందుకు రాష్ట్రానికి త్వరలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రానున్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు మంగళవారం ప్రకటించారు. ఫిబ్రవరి 24న ఆయన రానున్నట్లు తెలుస్తోంది. బీజేపీ ఆయన రాకకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఆయన చివరి సారిగా గతేడాది డిసెంబర్ 27న రాష్ట్రానికి వచ్చారు.షా లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి దిశానిర్దేశం చేయనున్నారు. తెలంగాణలో 10 ఎంపీ స్థానాలు గెలిచి 35 శాతం ఓట్లు సాధించాలని స్థానిక నాయకత్వానికి అమిత్ షా టార్గెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ జాయింట్ సెక్రటరీగా కాకుమాను లూర్దు జ్యోతి

హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రముఖ సంఘ సేవకురాలు కాకుమాను లూర్ధు జ్యోతి సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ జాయింట్ సెక్రటరీగా నియమితులైనారు. హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్తాపక అధ్యక్షురాలు పలు సేవా కార్యక్రమాల తో పాటు వివిధ హోదాలలో పని పని చేసారు. ఆమె సఖీ జాతీయ మహిళా మండలిలో చేరినందుకు సఖి జాతీయ మహిళా మండలి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది.

## తెలంగాణ రాష్ట్ర సచివాలయం నూతన మహిళా సంఘం, కార్యవర్గం ఏర్పాటు

హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);:తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకు ముందు సచివాలయం లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తూ ఉండేది. తెలంగాణ సచివాలయం లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ కు డా. బి. ఆర్ అంబేద్కర్ తెలంగాణ విమెన్ అసోసియేషన్ గా పేరును మారుస్తూ ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది. సర్వసభ్య సమావేశం లో, పది సంవత్సరాల తర్వాత పునరుద్ధరించబడిన మహిళా సంఘానికి తాత్కాలిక కార్యవర్గాన్ని నియమించడం జరిగినది. పద్మ, అధ్యక్షురాలు, కె. గీత, ప్రధాన కార్యదర్శి, పద్మావతి మరియు లలిత సహధ్యక్షులు, కె . రమాదేవి ఆర్గనైసింగ్ సెక్రటరీ, జి. లావణ్య లత, కోశాధికారి తదితరులు కార్యవర్గము లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల సచివాలయం లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు వారి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారిసమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషిచేస్తుందని ఆశభావాన్నీ వ్యక్తం చేసారు.

## వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతనే

### -కుటుంబ రాజకీయాలపై మండిపడ్డ మోదీ..

### -32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని

జమ్మూ కశ్మీర్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు.ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు. జమ్మూకశ్మీర్ కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కానుకలు అందించారు. సంగల్దాన్ స్టేషన్- బారాముల్లా స్టేషన్ మధ్య మొదటి ఎలక్ట్రిక్ రైలును ప్రధాని ప్రారంభించారు. బనిహాల్- ఖరీ- సుంబాద్-సంగల్దాన్ (48 కి.మీ) కొత్తగా విద్యుద్దీకరించబడిన బారాముల్లా- శ్రీనగర్-బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ (185.66 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గంతో సహా జమ్మూ, కాశ్మీర్‌లో వివిధ రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.ఎంఏ స్టేడియంలో పదేళ్ల క్రితం డిసెంబర్ 2013లో జమ్మూలోని ఇదే స్థలంలో లాల్కర్ ర్యాలీని ఉద్దేశించి ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. జమ్మూలో కూడా ఐఐటీ, ఐఐఎం వంటి విద్యాసంస్థలు ఎందుకు నిర్మించలేరని అప్పుడు ప్రశ్నించామని...ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చామని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్మించామని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రానికి చెందిన రెండు ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎంలు వచ్చాయి. జమ్మూ కాశ్మీర్‌లో సామాజిక న్యాయం కొత్త అధ్యాయం ప్రారంభమైంది. గుజ్జర్లు, పహారీలు, ఎస్టీలు, ఎస్సీలు, కాశ్మీరీ పండిట్లు, పశ్చిమ పాకిస్తాన్ నుంచి వచ్చిన శరణార్థులు రాష్ట్రంలో తమ హక్కులను పొందారని గుర్తు చేశారు



### రాజస్థాన్ నుంచి రాజ్యసభ కు సోనియాగాంధీ ఏకగ్రీవంగా ఎన్నిక

న్యూఢిల్లీ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభ కు మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోనియాగాంధీతో పాటు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలు చున్నీలాల్ గారసియా, మదన్ రాథోడ్‌లు రాజస్థాన్ నుంచి ఎగువ సభకు ఎన్నికైనట్టు అసెంబ్లీ సెక్రటరీ మహావీర్ ప్రసాద్ శర్మ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. పోటీలో ఇతర అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో ఈ ముగ్గురు నేతలు పోటీ లేకుండానే ఏకగ్రీవంగా పెద్దలసభకు ఎన్నికయ్యారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ సీఎం రేవంత్ భేటీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశ రాజధాని ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి, రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదారులుగా గుర్తింపు సహా పలు కీలక అంశాలపై చర్చించారు.తెలంగాణలోని 15 రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదా రులుగా అప్ గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ? శ్రీశైలం ఫోర్ లైన్ ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్ ? కల్వకుర్తి రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడం, రీజినల్ రింగ్ రోడ్డు (ఖీఖీఖీ)దక్షిణ భాగం అభివృద్ధి, హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడంపై గడ్కరీతో రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చించారు. సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (అఖీఎఈ) నుండి తెలంగాణకు నిధుల కేటాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు.నల్గొండలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని, నల్గొండ పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.

## దేశంలో అత్యంత పొడవైన రైల్వే సొరంగ మార్గాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

జమ్మూ కశ్మీర్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో అత్యంత పొడవైన రైల్వే సొరంగ మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఉధంపూర్- శ్రీనగర్- బారాముల్లా రైలు లింక్‌పై భారతదేశంలోనే అత్యంత పొడవైన రైలు సొరంగం జమ్మూలో ప్రారంభమైంది. శ్రీనగర్ నుంచి సంగల్దన్ మధ్య ఈ ఎలక్ట్రిక్ లైన్ సేవలందిస్తుంది. 48.1 కిలోమీటర్ల పొడవైన బనిహాల్-ఖారీ-సంబర్-సంగల్దాన్ సెక్షన్‌లో ఈ సొరంగం పొడవు 12.77 కిలోమీటర్లుగా ఉంది. ౧-50 గా పిలుచుకునే ఈ సొరంగం ఖరీ-సంబర్ సెక్షన్ పరిధిలోకి వస్తుంది. ఈ సొరంగ మార్గం అందుబాటులోకి వస్తే బారాముల్లా నుంచి బనిహాల్ మీదుగా సంగల్దాన్ వరకు రైళ్లు నడపవచ్చు. కాగా.. ఈ మార్గంలోని 11 సొరంగాలలో ౧-50 అత్యంత పొడవైనది కావడం విశేషం.2010 లో ప్రారంభమైన ఈ సొరంగం నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు 14 సంవత్సరాలు పట్టింది. అత్యవసర పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకు ౧-50కి సమాంతరంగా ఒక ఎస్కేప్ టన్నెల్ నిర్మించినట్లు అధికారులు పేర్కొన్నారు. సొరంగం లోపల అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి 375 మీటర్ల వద్ద ఎస్కేప్ టన్నెల్ కు కనెక్టింగ్ పాస్ నిర్మించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు ఎస్కేప్ టన్నెల్ ద్వారా బయటకు వచ్చి ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్యానికి చేరుకోవచ్చని వివరించారు.అగ్ని ప్రమాదం తలెత్తినప్పుడు వెంటనే మంటల్ని ఆర్పేందుకు సొరంగానికి రెండు వైపులా నీటి పైపులు ఏర్పాటు చేశారు. ప్రతి 375 మీటర్లకు ఒక ఓపెనింగ్ వాల్వ్ ను అమర్చారు. బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ ప్రారంభమైతే కశ్మీర్ లోయ నుంచి కన్యాకుమారి వరకు రైలును నడపాలనే ఆశయానికి బాటలు వేసినట్లు అవుతుందని ఉత్తర రైల్వే జోన్ అధికారులు చెబుతున్నారు.

## మేడారానికి బయలుదేరిన సమ్మక్క భర్త పగిడిద్దరాజు



ములుగు , ఫిబ్రవరి 20:ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసి గిరిజన జాతరైన సమ్మక్క-సారక్క జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది.. దీనిలోభాగంగా వన దేవతలు గద్దెలపై కొలువుధీరి భక్తులకు కోర్కెలను నెరవేర్చడానికి సమ్మక్క భర్త పగిడిద్దరాజు ను తన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా గంగారాం మండలం పూనుగొండ్ల గ్రామం లో ముస్తాబై బయలు దేరారు .పగడిద్ద రాజు స్వామివారిని పడగ రూపంలో మేడారం కు తరలిస్తు న్నారు. 20వ పెనక వంశీయులు తమ పూర్వీకుల అచారం ప్రకారం పగిగిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి మేడారం కు అటవి మార్గంలో కాలి నడకన బయలుదేరి కర్లపెల్లి, గుండ్లవాగు ప్రాజెక్టు మీదుగా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురం చేరుకుంటారు. నేటి రాత్రి అక్కడే బస చేసి మరుసటి రోజున రాత్రి స్వామివారిని మేడారంలోని గద్దెలపై ప్రతిష్టిస్తామని ఆలయ పూజారి తెలిపారు.

# శాస్త్రసాంకేతిక రంగాన్ని సహిత పట్టి పీడిస్తున్న లింగ వివక్ష

లింగ అసమానతలు పెంచి పోషిస్తున్నది నేటి పురుషాధిక్య సమాజం. అబలను వంటింటి కుందేలుగా బందీ చేస్తున్నది మగ అహంకారం. శ్రామిక వర్గం నుంచి అత్యున్నత శాస్త్ర సాంకేతిక రంగం వరకు ఎక్కడ చూసినా లింగ వివక్ష భూతం వెక్కిరిస్తున్నది. ఆధునిక డిజిటల్ యుగంలో సహితం మహిళలు/బాలికలను చులకనగా చూస్తూ, రెండవ శ్రేణి పౌరులుగా ముద్ర వేస్తున్నది మగ అహంకారం. అనాదిగా శాస్త్ర సాంకేతిక రంగాన్ని శాసిస్తున్నారు పురుష శాస్త్రవేత్తలు. అనాదిగా పురుషులతో సమానంగా మహిళా శాస్త్రవేత్తలు కూడా అన్ని రంగాల్లో ఎదుగుతున్నప్పటికీ వారికి ఇవ్వవలసిన గౌరవం, సముచిత స్థానం ఇవ్వడానికి మగమహారాజులు వెనకడుగు వేయడం సోచనీయమే కాదు ఆక్షేపణీయం కూడా. ప్రపంచ లింగ అసమానతల సూచీ–2023 వివరాల ప్రకారం 146 దేశాల జాబితాలో భారత్‌కు 127 స్థానం లభించడంతో భారతంలోని మహిళలు పడుతున్న లింగ వివక్ష సంక్షోభం అర్థం అవుతున్నది.

భారతంలో పలు రకాల లింగ అసమానతలు:

ఆర్థికపరమైన లింగ అసమానతల్లో ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం, సమాన పనికి సమాన వేతనంలో అసమానతలు, తండ్రి ఆస్తిలో వాటా లేకపోవడం లాంటివని మనకు అనుభవంలోకి వస్తున్నాయి. సామాజిక లింగ అసమానతల్లో వరకట్నం, మహిళలపై హింస, అక్రమ రవాణా, పడుపు వృత్తి, లైంగిక దాడులు, యాసిడ్ దాడులు, గృహ హింస, జోగినీ/దేవదాసీ వ్యవస్థలు, సరోగసి, భ్రూణ హత్యలు లాంటివి వస్తాయి. ఆరోగ్యకరమైన లింగ అసమానతల్లో బాలికలు/మహిళలకు టీకాలు తక్కువగా అందుబాటులో ఉండడం, మహిళల ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేయడం లాంటివి గమనించబడినవి. విద్యాపరమైన లింగ అసమానతల్లో పాఠశాల విద్యకు దూరంగా ఉండడం, మహిళా ఉపాధ్యాయుల కొరత, పాఠ్యాంశాల్లో లింగ వివక్ష వైఖరి, స్త్రీల అక్షరాస్యత రేటు తక్కువగా ఉండడం, మాధ్యమిక/ఉన్నత విద్యాలయ నమోదు తక్కువగా ఉండడం, రాజకీయంగా లింగ వివక్ష వెక్కిరించడం లాంటి అంశాలు వస్తాయి.

పరిశోధనా రంగంలో మహిళలు 16 శాతం మాత్రమే:

ఇటీవల బయట పడిన వివరాల ప్రకారం మన దేశంలో 56,747 మంది మహిళాశాస్త్రవేత్తలు/పరిశోధకులు ఉన్నారని, ఇది మొత్తం పరిశోధకుల్లో 16 శాతం మాత్రమే అని తెలుసుకోవాలి. దేశ పరిశోధనారంగాల్లో మహిళలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం "వూమెన్ సైంటిస్ట్ స్కీమ్ – ఏ, డబ్ల్యూఓఎస్ – ఏ"తో పాటు "కన్‌సాలిడేషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చ్ త్రూ ఇన్నొవేషన్ అండ్ ఎక్సలెన్స్ ఇన్ వూమెన్ యూనివర్సిటీస్, సియూఆర్ఐఈ", "జూజెండర్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ ట్రాన్స్‌ఫామింగ్ ఇనిస్టిట్యూషన్స్, జీఏటిఐ" లాంటి నూతన పథకాలను తీసుకురావడం ఆలస్యంగానైనా కొంత ఊరటను ఇస్తున్నది. అన్ని రకాలుగా మహిళలను ప్రోత్సహించినప్పటికీ మహిళలు పరిశోధనా రంగాలను వృత్తిగా స్వీకరించి కొనసాగడంలో వెనుకబడి ఉండడం విచారకరం. కొన్ని సందర్భాల్లో మహిళా పరిశోధకురాల్లోపై ప్రయోగశాలల్లో లైంగిక వేధింపులు కూడా జరగడం సోచనీయం. ఈ ప్రతికూల పరిస్థితులను తట్టుకొని నిలబడగలిగిన స్త్రీలు మాత్రమే పరిశోధనారంగాల్లో రాణించుట చూస్తున్నాం.

ప్రముఖ పరిశోధనాలయాల్లో కరువైన మహిళా డైరెక్టర్ జనరల్స్:

అనేక మంది భారత పురుష శాస్త్రవేత్తలు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అద్భుతాలను ప్రపంచానికి పరిచయం చేశారు. భారత ప్రముఖ పరిశోధనల సంస్థ అయిన "కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, సిఎస్ఐఆర్" పరిధిలో దేశవ్యాప్తంగా నెలకొన్న 38 జాతీయ పరిశోధనాలయాలు ఉండగా గత 75 ఏళ్లలో ఒక్క మహిళ కూడా ఆ సంస్థకు 2022 వరకు మహిళా డైరెక్టర్ జనరల్ పదవి రాలేదు. 2022లో తొలి సారి మన ప్రతిష్టాత్మక సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్‌గా మహిళామణి డా: కె. కలైసెల్వి నియామకం కావడం ఓ శుభ పరిణామమే అని చెప్పాలి. దురదృష్టవశాత్తు మన మరో ప్రతిష్టాత్మక జాతీయ ఐసిఏఆర్ సంస్థ పరిధిలో 113 పరిశోధనా సంస్థలు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నప్పటికీ ఆ జాతీయ సంస్థకు ఇప్పటి వరకు ఒక్క మహిళా శాస్త్రవేత్త కూడా డైరెక్టర్ జనరల్‌గా నియమించబడలేదు. అదే విధంగా దేశంలోని 24 అత్యున్నత ఐఐటీ సంస్థలకు 2022 వరకు మహిళా నిపుణులు డైరెక్టర్లుగా నియమించబడలేదు. 2023లో విదేశీ "ఐఐటీ జంజీబార్" సంస్థకు తొలి మహిళా శాస్త్రవేత్త ఆచార్య ప్రీతి అఘాలయమ్ డైరెక్టర్‌గా నియమించబడ్డారు.

కేంద్ర ప్రభుత్వ చొరవ:

పరిశోధనారంగాల్లోకి మహిళలను ఆకర్షించడానికి "నేషనల్ సైన్స్ అకాడమీ" చొరవతో ఎన్ఐపిజిఆర్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్) డైరెక్టర్ డా: సుభ్ర చక్రవర్తి నేతృత్వంలో "సైన్స్ ఫర్ వూమెన్ : ఏ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ పోర్టల్, ఎస్‌డబ్ల్యూఏటిఐ" అనబడే ఆకర్షణీయ పథకాన్ని తీసుకురావడం ఆహ్వానించదగిన పరిణామమే. ఈ పోర్టల్‌లో దేశంలోని మహిళా శాస్త్రవేత్తలు, పరిశోధకురాల్లు (ఆవార్డీలు, రీసెర్చ్ స్కాలర్స్, డైరెక్టర్లు, సెక్రెటరీలు, పిహెచ్‌డి స్కాలర్స్, పిజీస్, ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలు, అంకుర సంస్థల మహిళలు, గ్రాడ్యుయేట్స్, అండర్ గ్రాడ్యుయేట్స్ లాంటి వారు) తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని, దీని ద్వారా వారికి సముచిత స్థానం దక్కుతుందని నమ్ముతున్నారు.

మహిళా పరిశోధకురాల్లు, శాస్త్రవేత్తలు తమ పరిశోధనా ఫలితాలను బహిర్గతపరుస్తూ, భారత శాస్త్రవేత్తలతో పాటు ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించి ఉన్నత స్థానాలకు చేరాలని సూచిస్తున్నారు. పురుషులతో పాటు మహిళామణుల్లో సహితం సకారాత్మక మార్పులు రావడం, అర్హతకు తగిన స్థానాలు పొందడం, ధైర్యంగా మహిళలు పరిశోధనలను కెరీర్‌గా తీసుకోవడం, తల్లితండ్రులు తమ కూతుళ్లను ప్రోత్సహించడం, పౌర సమాజం మహిళా శాస్త్రవేత్తలను గౌరవించడం లాంటివి కూడా ఏకకాలంలో జరిగితేనే పరిశోధనాలయాల్లో లింగ వివక్ష తగ్గుతుందని, ఆ రోజులు త్వరగా రావాలని కోరుకుందాం, ఆమెలో దాగిన శాస్త్రవేత్తను జాగృత పరుద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఉత్తర్ ప్రదేశ్‌లోని సంభల్‌లో శ్రీ కల్కి ధామ్ ఆలయానికి శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ఉత్తర్ ప్రదేశ్ లోని సంభల్ జిల్లా లో శ్రీ కల్కి ధామ్ దేవాలయాని కి శంకుస్థాపన చేశారు. శ్రీ కల్కి ధామ్ దేవాలయం యొక్క నమూనా ను కూడా ప్రధాన మంత్రి ఆవిష్కరించారు. శ్రీ కల్కి ధామ్ ను ఆచార్య శ్రీ ప్రమోద్ కృష్ణమ్ చైర్‌మన్ గా ఉన్నటువంటి శ్రీ కల్కి ధామ్ నిర్మాణ్ ట్రస్టు నిర్మిస్తున్నది. ఈ కార్యక్రమం లో అనేక మంది సాధువులు, ధార్మిక నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాలుపంచుకొంటున్నారు.

సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ప్రభువు శ్రీ రాముని మరియు శ్రీ కృష్ణుని నిలయం అయినటువంటి ఈ ప్రాంతం భక్తి, భావోద్వేగం మరియు ఆధ్యాత్మికత్వం లతో మరొక్క సారి నిండిపోయింది. మరొక ప్రముఖ తీర్థయాత్ర స్థలాని కి శంకుస్థాపన కార్యక్రమం ఈ రోజు జరుగుతుండడమే దీనికి కారణం. సంభల్ లో శ్రీ కల్కిధామ్ దేవాలయాని కి శంకుస్థాపన చేసే అవకాశం లభించినందుకు శ్రీ నరేంద్ర మోదీ కృతజ్ఞత ను వ్యక్తం చేశారు. ఇది భారతదేశం లో ఆధ్యాత్మికత్వం తాలూకు ఒక క్రొత్త కేంద్రం గా ఉనికి లోకి వస్తుందన్న విశ్వాసాన్ని కూడా ఆయన వ్యక్తం చేశారు. ఈ సందర్భం లో ప్రపంచవ్యాప్తం గా పౌరులు అందరికీ మరియు తీర్థయాత్రికుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన శుభాకాంక్షల ను వ్యక్తం చేశారు.

పద్దెనిమిది సంవత్సరాల పాటు నిరీక్షణ అనంతరం ఈ ధామం ప్రారంభం అవుతున్న విషయాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, నేను పూర్తి చేయవలసిన సత్కార్యాలు అనేకం ఉన్నట్లు గా అనిపిస్తోంది అన్నారు. ప్రజల యొక్క మరియు మునుల యొక్క ఆశీర్వాదాల తో అసంపూర్తి గా ఉన్న కార్యాల ను పూర్తి చేయడాన్ని తాను కొనసాగిస్తూ ఉంటానని ఆయన అన్నారు.

ఈ రోజు న ఛత్రపతి శ్రీ శివాజీ మహారాజ్ యొక్క జయంతి. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి గుర్తు చేస్తూ, నేడు జరుగుతున్నటువంటి సాంస్కృతిక పునరుద్ధరణ, గౌరవం మరియు మన గుర్తింపు పట్ల నమ్మకాల కు సంబంధించిన ఖ్యాతి శ్రీ శివాజీ మహారాజ్ కు దక్కుతుంది అన్నారు. ఛత్రపతి శ్రీ శివాజీ మహారాజ్ కు ప్రధాన మంత్రి శ్రద్ధాంజలి ని ఘటించారు.

దేవాలయం యొక్క వాస్తు కళ ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈ దేవాలయం లో పది గర్భగుడులు ఉంటాయి, వాటిలో భగవానుని దశ అవతారాల మూర్తులు కొలువుదీరుతాయి అన్నారు. ఈ పది అవతారాల ద్వారా ధర్మ గ్రంథాల లో మానవ రూపం సహా భగవానుని యొక్క అన్ని రూపాల ను ఆవిష్కరించడం జరిగింది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వివరించారు. "జీవనం లో ఎవరైనా ఒక వ్యక్తి భగవానుని యొక్క చేతన ను తన అనుభవం లోకి తెచ్చుకోగలుగుతారు. '' మనం భగవానుని 'సింహం , వరాహం మరియు కూర్మం' ల రూపాల లో అనుభవం లోకి తెచ్చుకొన్నాం" అని అని ప్రధాన మంత్రి అన్నారు. భగవానుని ఈ స్వరూపాల లో కొలువుదీర్చడం ప్రజల కు భగవాన్ పట్ల మాన్యత తాలూకు సమగ్రమైన మూర్తుల ను అవగాహన లోకి తీసుకు వస్తుంది అని ఆయన అన్నారు. శ్రీ కల్కి ధామ్ దేవాలయాని కి శంకుస్థాపన ను చేసే అవకాశాన్ని తనకు ఇచ్చినందుకు గాను భగవంతుని కి ధన్యవాదాల ను ప్రధాన మంత్రి తెలియ జేశారు. ప్రధాన మంత్రి ఈ కార్యక్రమం లో హాజరు అయిన మునులు అనేక మంది కి వారు అందించినటువంటి మార్గదర్శకత్వాని కి గాను ప్రణామాన్ని ఆచరించడం తో పాటుగా శ్రీ ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ కు కూడా ధన్యవాదాల ను వ్యక్తం చేశారు.

ఈ రోజు న జరుపుకొంటున్నటువంటి కార్యక్రమం భారతదేశం యొక్క సాంస్కృతిక పునర్జాగరణ తాలూకు మరొక అద్వితీయమైనటువంటి క్షణం గా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. అయోధ్య ధామ్ లో శ్రీ రామ మందిరం యొక్క అభిషేకం గురించి మరియు అబూ ధాబి లో ఆలయాన్ని ఇటీవల ప్రారంభించడాన్ని గురించి ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వస్తూ, "ఊహ కు ఎప్పుడైనా అందనిది ఇక వాస్తవం గా మారిపోయింది" అన్నారు.

వెంట వెంటనే ఆ తరహా కార్యక్రమాలు చోటు చేసుకొంటూ ఉండడం యొక్క మహత్వాన్ని గురించి ప్రధాన మంత్రి నొక్కిపలికారు. ఆధ్యాత్మిక ఉత్థానాన్ని గురించి ఆయన మాట్లాడుతూ, కాశీ లో విశ్వనాథ్ ధామ్, కాశీ యొక్క రూపు రేఖలు మార్పునకు లోను కావడం, మహాకాళ్ మహాలోక్, సోమ్ నాథ్, ఇంకా కేదార్ నాథ్ ధామ్ లను గురించి ప్రస్తావించారు. " మనం 'వికాస్ భీ విరాసత్ భీ' ('వారసత్వం తో పాటుగా అభివృద్ధి కూడాను) అనే మంత్రం తో ముందుకు సాగిపోతున్నాం" అని ఆయన అన్నారు. అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానం తో కూడినటువంటి పట్టణ ప్రాంతాల మౌలిక సదుపాయాలు సిద్ధం అవుతుండడాన్ని ఒక వైపు న, ఆధ్యాత్మిక కేంద్రాల ను మరొక వైపున, దేవాలయాల జాడ ను ఒక ప్రక్కన, క్రొత్త వైద్య చికిత్స కళశాల ల స్థాపన ను మరొక వైపు న, విదేశాల నుండి కళాకృతులు భారతదేశాని కి తరలి వస్తుండడాన్ని ఒక వైపున మరియు విదేశీ పెట్టుబడుల రాక ను మరొక వైపు మనం గమనించ వచ్చును అని ఆయన అన్నారు. ఈ ఘటన క్రమాలు కాలమనే చక్రం యొక్క భ్రమణాన్ని సూచిస్తున్నాయి అని ఆయన అన్నారు. ఎర్ర కోట మీది నుండి ఆయన 'యహీ సమయ్ హై, సహీ సమయ్ హై' (' ఇదే సమయం – ఇదే సరి అయినటువంటి సమయం') అంటూ ఇచ్చిన పిలుపు ను గుర్తు కు తీసుకు వస్తూ, కాలం తో కలసి నడవవలసినటువంటి అవసరం ఎంతయినా ఉంది అని స్పష్టం చేశారు.

# ఈనెల 22న "ఛలో సెక్రటేరియట్"కు కాంగ్రెస్ పిలుపు

విజయవాడ, ఫిబ్రవరి 20 (ఎక్స్‌ప్రెస్ న్యూ స్);: ఈనెల 22న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యం లో యువజన సమస్యల మీద "ఛలో సెక్రటేరియట్"కు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం సీడబ్ల్యూసీ ఆహ్వానిత సభ్యులు గిడుగు రుద్రరాజు మీడియాకు తెలియజేశారు. ఎల్లుండి ఉదయం 10 గంటలకు ఆంధ్రభవన్ నుంచి ఛలో సెక్రటేరియట్ ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ సీనియర్లు, యువజన కాంగ్రెస్, పార్టీ అనుబంధ సంఘాలు పాల్గొంటాయన్నారు. 26న సాయంత్రం అనంతపురంలో జరిగే భారీ బహిరంగ సభలో మల్లిఖార్జున ఖర్గే ప్రసంగిస్తారని తెలిపారు. విశాఖ, గుంటూరు, జంగారెడ్డిగూడెంలలో బహిరంగ సభలు ఉంటాయని.. కర్నాటక, తెలంగాణ సీఎంలు, ప్రియాంక గాంధీ బహిరంగ సభలలో ప్రసంగిస్తారని వెల్లడించారు. చివరిగా రాహుల్ గాంధీ సమక్షంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. మార్చి చివరకల్లా ఈ షెడ్యూల్ పూర్తి చేసేలా సిద్ధం చేశామని గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు.

# భక్తులకు సౌకర్యాలు భేష్.. టీటీడీకి హోం వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ అభినందన



తిరుపతి, ఫిబ్రవరి 20: శ్రీవారి దర్శనార్థం దేశం నలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులకు టీటీడీ దర్శనం, అన్నప్రసాదాలు, గదులు తదితర సౌకర్యాలను చక్కగా కల్పిస్తోందని బ్రిజ్‌లాల్ అధ్యక్షతన గల భారత హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభినందించింది. కమిటీ సభ్యులు మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవో ఎవి.ధర్మారెడ్డి టీటీడీ ఆవిర్భావం నుండి చేపడుతున్న వివిధ సామాజిక, ధార్మిక, సంక్షేమ కార్యకలాపాలను 40నిమిషాల ఆడియో విజువల్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం కమిటీ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ? శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం గొప్ప అనుభూతిని మిగిల్చిందన్నారు. శ్రీవారి దర్శనం కోసం వస్తున్న యాత్రికులను, తిరుమల పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని టీటీడీ చేపడుతున్న చర్యలు బాగున్నాయని చెప్పారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ పద్ధతులు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, విపత్తుల నిర్వహణ ప్రణాళికలను ప్రశంసించారు.

కమిటీ సభ్యులు బిప్లవ్ కుమార్ దేవ్, నీరజ్ శేఖర్, దిలీప్ ఘోష్, దులాల్ చంద్ర గోస్వామి, రాజా అమరేశ్వర నాయక్, డాక్టర్ సత్యపాల్ సింగ్, డాక్టర్ నిషికాంత్ దూబే, హోం వ్యవహారాల శాఖకు చెందిన ఇతర అధికారులతో పాటు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ మలికా గార్గ్, టీటీడీ, జిల్లా, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జగన్ సమక్షంలో సొంత గూటికి చేరిన ఎమ్మెల్యే ఆర్కే..

గుంటూరు, ఫిబ్రవరి 20: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. మంగళవారం మధ్యాహ్నం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారాయన. సీఎం జగన్ కండువా కప్పి ఆర్కేను పార్టీకి ఆహ్వానించారు. గత డిసెంబర్‌లో వ్యక్తిగత కారణాల పేరిట వైఎస్సార్‌సీపీకి, మంగళగిరి ఎమ్మెల్యే పదవికి ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా చేశారు.

అయితే ఆ సమయంలో ఆయన రాజీనామాపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈలోపు ఆర్కే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే నెల వ్యవధి కాకముందే తిరిగి సొంత గూటికి చేరాలని ఆయన నిర్ణయించుకోవడం విశేషం. ఇదిలా ఉంటే సామాజిక సమీకరణాల్లో భాగంగా మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గంజి చిరంజీవిని వైఎస్సార్‌సీపీ అధిష్టానం నియమించింది. ఈ నేపథ్యంలో తిరిగి పార్టీలోకి వచ్చిన ఆర్కేకు నియోజకవర్గంలో గెలుపు బాధ్యతలను జగన్ అప్పగించారు.

# విదేయుతకే అధిష్టానం పట్టం..

- అ దిశగా సంకేతాలు ఇస్తున్న పార్టీ అధినాయకత్వం..
- రాజ్యసభ సభ్యుల ఎంపిక సైతం విదేయతనే ప్రామాణికంగా చూసిన ఏఐసీసీ..
- రేపటి పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికను కూడా అలాగే చేయాలి అని చెప్పిన అగ్రనేత రాహుల్ గాంధీ..
- కొత్త వారికి భవిష్యత్ లో సముచిత స్థానం కల్పిస్తాం అని హామీ..
- ఖమ్మం సహా మరి కొన్ని సీట్లలో అభ్యర్థుల పై నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్

ఖమ్మం, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక లో తీవ్ర కసరత్తు చేస్తుంది. పార్టీకి విధేయులుగా ఉన్న వారికి ప్రాధాన్యం ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం చర్యలు తీసుకుంటుంది. అందుకు ముందుగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికను కూడా కాంగ్రెస్ పార్టీ చాలా దూరదృష్టి తో వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను ముందుగానే గుర్తించి అందుకు అనుగుణంగా సీనియర్లు, జూనియర్లు బేరీజు వేస్తూ పార్టీకి విధేయులుగా పని చేసిన వారినే ఎంపిక చేసింది. అలాగే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కూడా ఈ ఎంపిక జరిగింది అని కొందరు రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువ స్థానాల్లో విజయం సాధించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూనే, పార్టీకి విధేయులుగా ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. మరి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది అక్కడ ఎన్నికలకు ముందు అనేక చేరికలు జరిగినవి ఎన్నికల్లో కష్టాల్లో ఉన్న పార్టీ కోసం గత పదేళ్లు కష్టపడిన వారిని ఒప్పించి వారిని ఆపి కొత్తగా వచ్చిన అనేకమందికి టికెట్ల కేటాయించింది పార్టీ అలా వారికి సముచిత స్థానం కేటాయించింది. అలాగే వారికి ఏర్పడిన ప్రభుత్వంలో సైతం మంచి అవకాశాలు కల్పించింది. అవి అన్ని దృష్టిలో పెట్టుకొని అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ సీనియర్లకు, కష్ట కాలంలో పార్టీకి విధేయులుగా ఉన్న వారికి పార్లమెంట్ సీట్లు కేటాయిస్తారు అని పార్టీ పెద్దలు అంటున్నారు. చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికలో పోటాపోటీ ఉన్నది ఖమ్మం, మహబూబ్ బాద్, మల్కాజ్ గిరి, వరంగల్, భువనగిరి, నల్లగొండ మొదలగు సీట్లలో అధిష్ఠానం మీద తీవ్ర ఒత్తిడి ఉన్నది. మరి ముఖ్యంగా ఖమ్మం సీట్ విషయంలో కూడా తీవ్ర పోటీ నెలకొన్నది మొదటగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, రేణుకా చౌదరి, పొంగులేటి ప్రసాద్ రెడ్డి, వంకాయలపాటి రాజేందర్ ప్రసాద్ లు పోటీలో ఉండగా ఇటీవలే రేణుకా చౌదరి కి రాజ్యసభ కు ఎంపిక చేయడంతో మిగిలిన ముగ్గురు పోటీలో ఉన్నట్లైంది...అయితే అధిష్టానం గత కొన్ని రోజులుగా తీవ్రంగా ఆలోచించిన పిమ్మట ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఢిల్లీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎన్నికల ముందు పార్టీ లోకి వచ్చినా ఆయనకు పార్టీ మంచి గుర్తింపు ఇచ్చి సముచిత స్థానం ఇచ్చాము అనే భావనతో ఉన్నట్లు తెలుస్తుంది అందుకే మల్లు అనంతరాములు నుండి భట్టి విక్రమార్క వరకు వారి కుటుంబం కాంగ్రెస్ కు విధేయులుగా ఉన్నారు మరి ముఖ్యంగా భట్టి విక్రమార్క అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉన్నారు. ఆయనకు పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తారు అని పేరు ఉన్నది 1300 కి.మీ పాదయాత్ర చేసి తెలంగాణ లో పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడ్డారు, గత పదేళ్లు ప్రతిపక్షంలో జిల్లా కాంగ్రెస్ ను ఒంటి చేత్తో కాపాడుకున్నాడు ఇవన్నీ గమనించిన అధిష్టానం ఆయన కష్టానికి ప్రతిఫలంగా, నందిని జిల్లాలో 20 ఏళ్లుగా చేస్తున్న సేవను దృష్టిలో పెట్టుకొని, జిల్లా సీనియర్ నేతల ఒత్తిడి మేరకు ఆయన సతీమణి నందినికి ఖమ్మం ఎంపీ టికెట్ దాదాపు ఖాయం అనే వార్తలు ఢిల్లీ లో, గాంధీ భవన్ లో చక్కర్లు కొడుతోంది.



# రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన జగన్.. పల్లంరాజు




అమరావతి, ఫిబ్రవరి 20:సీఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశారని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ అధ్యక్షుడు పల్లంరాజు విమర్శించారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల మేనిపెస్టో కమిటీ రెండవ సమావేశం గాంధీనగర్లోని ఆంధ్రరత్న భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ చైర్మన్ పల్లంరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దివాలా తీసే దిశగా తీసుకెళ్లారని విమర్శించారు. ఏపీ ఎన్నికల్లో ప్రజాదరణ పొందేందుకు మేనిఫెస్టోలో చర్చించవలసిన ప్రాధాన్యత అంశాలపై చర్చించి మేనిఫెస్టో ఆమోదం కోసం అధిష్టానానికి పంపించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రాంతీయ పార్టీలు టీడీపీ, వైసీపీలు రాష్ట్రానికి తీరని ద్రోహం చేసాయని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, రెండు పోర్టులను ప్రైవేటీకరణ చేశారని రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్ర రాజధాని అయోమయంలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుల నుంచి విద్యార్థులు, మహిళలు, రైతాంగం, పరిశ్రమల అభివృద్ధి, నాలెడ్జ్ డెవలప్ మెంట్ దళిత, గిరిజన సంక్షేమం కోసం మంచి సలహాలు వచ్చాయన్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలు తమతో పొత్తులో ఉన్నాయని తెలిపారు. వారితో చర్చించి ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు.

# ఎసిబికి చిక్కిన జ్యోతికి అస్వస్థత..

హైదరాబాద్, ఫిబ్రవరి 20: లంచం కేసులో అరెస్ట్ అయిన ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జ్యోతి అస్వస్థత గురయ్యారు. కొద్ది గంటల్లో కోర్టులో హాజరుకానుండగా ఆమె అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఏసీబీ అధికారులు ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆమెకు ఉస్మానియా హాస్పిటల్ సూపరిండెంట్ నాగేందర్ చికిత్స అందిస్తున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జ్యోతి ని చాతినొప్పి వచ్చిందని ఏసీబీ అధికారులు తీసుకొచ్చారు. జ్యోతిని అడ్మిట్ చేసుకున్నామని నాగేదంర్ తెలిపారు. జ్యోతికి ఈసీజే, బీపీ, బ్లడ్ టెస్ట్ లు, బ్లడ్ షుగర్, గుండెకి సంబంధించిన అన్ని టెస్టులు చేశామని, నార్మల్ గా ఉన్నాయని తెలిపారు. జ్యోతికి ప్రస్తుతం టుడేఈకో టెస్ట్ చేసిన తర్వాత డిశ్చార్జి చేస్తామన్నారు. జ్యోతి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని నాగేం దర్ తెలిపారు. లంచం తీసుకుంటున్న గిరిజన సంక్షేమ అధికారి జ్యోతిని పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం జ్యోతి నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అధికారి నివాసంలో అధికారులు ఎక్కడికి వెళ్లినా నగదు, బంగారం దొరికాయి. ఇంత బంగారాన్ని చూసి అధికారులు ఆశ్చర్యపోయారు. సుమారు రూ.65 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు.. నాలుగు కేజీల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

# ప్రతి కుటుంబానికి ఆస్తి చదువే...సీఎం జగన్




అమరావతి, ఫిబ్రవరి 20:తల్లి చదివితే, పిల్లలూ చదువు బాట పడుతారు, కుటుంబం భవిష్యత్తు తలరాత మారాలంటే మంచి చదువులే కుటుంబానికి ఆస్తిగా మారుతాయని, అందుకే వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల్లో వధువరూలకు కనీస విద్యార్హత నిబంధన విధించామని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు.

తాడేపల్లి సీఎంవో కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి ఈ నిధులను విడుదల చేశారు.

ఈ సీఎం వైఎస్ జగన్ మాటాడుతూ, చంద్రబాబు హయాంలో నామమాత్రంగా ఉన్న పథకాన్ని తాము బాగు చేశామని, దాదాపు 10,132 మంది జంటలకు, పిల్లలకు ఈరోజు మంచి జరుగు తుందని, వైయస్సార్ కల్యాణమస్తు, వైయస్సార్ షాదీ తోఫా కార్యక్రమం ప్రతి పేదవాడికీ పిల్లలను చదివించే విషయంలో ప్రోత్సహిస్తూ కచ్చితంగా పదో తరగతి సర్టిఫికెట్ ఇద్దరికీ ఉండాలని నిబంధన విధించామని, ఈ పథకంలో కనీస అర్హత కచ్చితంగా తమ పిల్లల చదువును ప్రోత్సాహిస్తుందన్నారు.

18 ఏళ్లకు ముందే పెళ్లి జరిగితే ఈ స్కీమ్ కు అనర్హులు కాబట్టి, ఇంటర్ మీడియట్ కోసం కాలేజీకి పంపితే అమ్మ ఒడి అనే పథకం ప్రభుత్వం ఇస్తుంది కాబట్టి ప్రతి సంవత్సరం మంచి జరుగుతుందని, అందుకే కచ్చితంగా ఆ ఇంటర్మీడియట్ చదివించే కార్యక్రమం దిశగా తల్లిదండ్రులు అడుగులు వేస్తారని, ఇంటర్ తర్వాత పూర్తి ఫీజు రీయింబర్సుమెంట్ ఇచ్చే విద్యాదీవెన ఉంది. అదేమాదిరిగా వసతి దీవెన కూడా బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.20 వేల దాకా విద్యా సంవత్సరంలో ప్రతి ఏప్రిల్ లో ఇస్తున్నాం. ఈ రెండు స్కీములు ఎలాగూ ఉన్నాయి కాబట్టి చదువులను ప్రోత్సహిస్తూ ప్రతి పాపా, ప్రతి పిల్లాడూ గ్రాడ్యుయేట్స్ అయ్యేలా అడుగులు వేయించగలుగుతున్నామని సీఎం జగన్ వివరించారు.

గతంలో 40 వేలకు పరిమితమైన ఎస్సీలకు రూ.లక్షల వరకూ తీసుకుపోయాం. కులాంతర వివాహానికి రూ.1.20 లక్షల వరకు, ఎస్టీలకు రూ.50 వేల నుంచి రూ.లక్షల వరకూ, కులాంతర వివాహం అయితే రూ.1.20 లక్షల వరకూ తీసుకుపోయామని, . గతంలో బీసీలకు కేవలం రూ.35 వేలు మాత్రమే ఇస్తుంటే దాన్ని రూ.50 వేల వరకు, కులాంతర వివాహానికి రూ.75 వేల వరకూ తీసుకు వెళ్లామని సీఎం జగన్ వివరించారు. గత ప్రభుత్వం 17,790 జంటలకు నామ్ కే వాస్తే రీతిలో ఇచ్చి రూ.70 కోట్ల మేరకు ఎగనామం పెట్టిందని, గత ఐదేళ్లుగా 56,196 జంటలకు రూ.427 కోట్లు అందించామని, ప్రస్తుతం 10,132 జంటలకు రూ.78 కోట్లు విడుదల చేసినట్టు సీఎం జగన్ తెలిపారు.

# భూ ఆక్రమణలకు పాల్పడినట్టు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా

## -టీడీపీ యువనేత నారా లోకేష్‌కు మంత్రి గుడివాడ అమర్నాథ్ సవాల్

విశాఖపట్నం, ఫిబ్రవరి 20: టీడీపీ యువనేత నారా లోకేష్‌కు మంత్రి గుడివాడ అమర్నాథ్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. అవినీతి చేసినట్టు కానీ, భూ ఆక్రమణలకు పాల్పడినట్టు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తాను అంటూ సవాల్ విసిరారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన మంత్రి... "పవన్ కళ్యాణ్ నన్ను ఏమీ పీకలేకపోయారు... నువ్వెంత. పూరి గుడిసె నుంచి రాయల్ ప్యాలెస్‌లోకి ఎలా ఎదగగలిగావో చెప్పగలవా లోకేష్. అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే 420.... అటువంటి వ్యక్తిని పక్కన పెట్టుకుని నన్ను విమర్శిస్తారా.. నేను పాలు తాగి పెరిగితే... మాజీ ఎమ్మెల్యే గోవింద్ సారా తాగి పెరిగాడు.. సారా కాసుకుని పెరిగిన నా కొడుకులు అందరూ నన్ను విమర్శిస్తారా.. శంఖారావం అని పలకడం కూడా తెలియని మొద్దు లోకేష్. లోకేష్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్న అంటూ.. మట్టి కుండలో పప్పు.. ఉప్పు, కారం కలిపి సిద్ధంగా వుంచాం. లోకేష్ తనంతట తానుగా వచ్చిన సరే లేకపోతే నేనే పంపిస్తాను. చంద్రబాబు లోకేష్‌లలో పౌరుషం, రోషం రావాలనే పప్పులో ఉత్తరాంధ్ర ఉప్పు, కారం కలిపా. లోకేష్‌లా నేను బ్యాక్ డోర్ పొలిటీషియన్ కాదు.. కష్టపడి క్రింది స్థాయి నుండి వచ్చిన వాడిని" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# 26నుంచి అనంతలో జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ.. పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీలక్ష్మి..




ఫిబ్రవరి 20:విజయవాడ - అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్లో వర్కింగ్ జర్నలిస్టులందరూ పాల్గొని ఐకమత్యంతో ముందుకెళ్లాలని పుంపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో అనంతపురంలో ఈనెల 26వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం ఉదయం శ్రీలక్ష్మి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి తో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ? అనంతపురంలో రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నిత్యం పని ఒత్తిడితో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులకు రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాల్లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ టోర్నమెంట్ నిర్వహించడం ఒక రికార్డ్ అని అన్నారు. ఇందులో వర్కింగ్ జర్నలిస్టులందరూ పాల్గొని విజయవంతం చేయాలని, ఈ టోర్నీ జర్నలిస్టుల ఆటవిడుపుకి కూడా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ తిరుపతి నగేష్, డి.రాజగోపాల్, అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, తిరుపతి జిల్లా నాయకుడు వెంకటేష్, ఇతర సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మత్స్యకారులను అవమానించేలా ద్వారంపూడి మాటలు

## - మండిపడ్డారు మత్స్యకార సంఘాలు, టీడీపీ నేతలు

కాకినాడ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలు కాక రేపుతున్నాయి. మత్స్యకారులను అవమానించేలా ద్వారంపూడి మాట్లాడారంటూ మత్స్యకార సంఘాలు, టీడీపీ నేతలు మండిపడ్డారు. కోటి రూపాయలతో గుడి కడితే రూ. 10 కోట్లు వసూలు చేసే జాతి మీది అంటూ మాజీ ఎమ్మెల్యే కొండబాబు ను ద్వారంపూడి దూషించారు. ఈ వ్యాఖ్యలపై సామాజిక వర్గ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే ద్వారంపూడి ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు.వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మత్స్యకారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ద్వారంపూడికి వ్యతిరేకంగా కాకినాడ జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి మత్స్యకార సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'రూ. కోటితో గుడి కడితే రూ. 10 కోట్లు వసూలు చేసే జాతి, కుటుంబం నీది.. నీలా ప్రజల దగ్గర విరాళాలు తీసుకుని నేను ఆలయం కట్టలేదు' అని రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే కొండబాబును ఉద్దేశిస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో తమను అవమానించారంటూ సామాజికవర్గం భగ్గుమంటొంది. మత్స్యకార జాతిని అవమానించేలా ద్వారంపూడి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని మత్స్యకార సంఘాల నేతలు అన్నారు. మత్స్యకారుల ఓట్లతో గెలిచిన ఆయన ఈ విధంగా మాట్లాడడం సరికాదని అన్నారు. తక్షణం ద్వారంపూడి క్షమాపణ చెప్పకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మత్స్యకార సంఘాల నేతలు హెచ్చరించారు

# కుటుంబ పాలన కావాలా.. దేశ హితం పాలన కావాలా .. తేల్చుకోండన్న కేంద్రమంత్రి రూపాల



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిజెపి దేశం కోసం పని చేస్తుంటే కాంగ్రెస్ సహా దేశంలో ఇతర పార్టీలన్నీ తమ కుటుంబ కోసం పాలన చేస్తున్నాయని కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. కుటుంబ పాలన కోసం పనిచేసే పార్టీలు కావాలా దేశం కోసం ప్రజల కోసం పనిచేసే బిజెపి కావాలా ఆలోచించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో దేశం కోసం నిరంతరం పనిచేస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వానికి మద్దతు ఇచ్చి తెలంగాణలో బిజెపి కి అఖండ విజయం సాధించి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నేడు నిర్వహించిన విజయసంకల్పయాత్ర బహిరంగ సభకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర ఏళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిందన్నారు .ఇప్పటివరకు 25వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉంటే తొమ్మిదిన్నర ఏళ్లలో అదనంగా మరో 25 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ పాలనలో కాశ్మీర్లో ఎస్సీలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించలేదని అంటూ నరేంద్ర మోడీ ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దుచేసి కాశ్మీర్లో ఎస్సీలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించిన ఘనత బిజెపి దేనని అన్నారు. తొమ్మిదిన్నర ఏళ్లలో రూపాయి దోపిడీ జరగలేదని కాంగ్రెస్ పాలనలో వేలకోట్ల రూపాయలు దోపిడీ జరిగిందని ఆయన ధ్వజమెత్తారు. ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలోని ఓ కాంగ్రెస్ ఎంపీ నివాసంలో 400 కోట్ల రూపాయలు బయటపడడం కాంగ్రెస్ పాలనకు అద్దం పడుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమం దేశం కోసం పనిచేస్తున్న నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరిచి మరోసారి మోదీ ప్రభుత్వం కోసం తెలంగాణలో బిజెపిని గెలిపించాల్సిందిగా కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ పార్లమెంటు సభ్యులు ఏపీ. జితేందర్ రెడ్డి ,నాయకులు బంగారు శృతి, శ్రీ వర్ధన్ రెడ్డి, నాగురావ్ నామాజీ ,కొండయ్య ,మాదిరెడ్డి జలంధర్ రెడ్డి ,కొత్త కాపు రతంగ పాండు రెడ్డి ,పగడాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహితమే ప్రాణపదం- జడ్జి సునీత కుంచాల



నిజామాబాద్, ఫిబ్రవరి 20:: పర్యావరణ పరిరక్షణకు, మానవ మనుగడకు ప్లాస్టిక్ రహితవే ప్రాణపదమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది బాస రాజేశ్వర్ వారి తల్లిదండ్రులు బాస పోశెట్టి లక్ష్మిబాయిల స్మృతార్థం కాటన్ క్లాత్ తో రూపొందించిన హ్యాండ్ బ్యాగులను మంగళవారం జిల్లాకోర్టులోని తన చాంబర్ లో సీనియర్ న్యాయవాదులు మంథని రాజేందర్ రెడ్డి, ఆకుల రమేష్, నీలకంట రావు, గొర్రెపాటి మాధవ రావు, శ్రీహరి ఆచార్య, కుమార్ దాస్, జె.వెంకటేశ్వర్, వి.భాస్కర్,మానిక్ రాజ్, ఆశ నారాయణ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ? తాగే నీటి నుండి మొదలు తినే ఆహారం వరకు ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి బట్టలతో తయారు చేసిన వాటిని ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు వాడటం వలన అనేక అనారోగ్య సమస్యలు మనుషులను చుట్టుముడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గత కాలపు తరం బట్టలతో చేసిన వాటి ఉపయోగించి ఆరోగ్యంగా జీవించారని, వారే నేటి తరానికి ఆదర్శం కావాలని ఆమె అన్నారు. ప్రతి పౌరుడు తన తల్లి దండ్రుల పేరున క్లాత్ తో తయారు చేసిన బ్యాగులను, ఇతరత్రా చిన్నచిన్న బ్యాగులను ప్రజలకు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు కారకులు కావాలని ఆమె ఆకాంక్షించారు.

# ఆ ఓట్లనూ లెక్కలోకి తీసుకోండి..

## -చండీగఢ్ మేయర్ ఎన్నికలపై సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు

న్యూ డిల్లీ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);చండీగఢ్ మేయర్ ఎన్నికలపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఎనిమిది చెల్లిన ఓట్లు ఉన్నాయని, కాబట్టి మళ్లీ లెక్కించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఓట్ ట్యాంపరింగ్ ఆరోపణలపై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఈ ఏడాది జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. కార్పొరేషన్‌లో 35 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఆప్-కాంగ్రెస్ కూటమికి 20, బీజేపీకి 14, ఎస్ఏడీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. మేయర్ ఓటింగ్ సందర్భంగా ఆప్-కాంగ్రెస్ కూటమికి చెందిన 8 మంది కౌన్సిలర్ల ఓట్లను చెల్లనివిగా ఆర్వో అనిల్ మాసిహ్ చెల్లనివిగా ప్రకటించారు. బీజేపీ మేయర్ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను విజేతగా ప్రకటించారు. బ్యాలెట్ పేపర్లపై రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్ ఎక్స్ మార్క్ పెడుతున్నట్లు అక్కడే ఉన్న సీసీటీవీ ఫుటేజీలో రికార్డ్ అయింది. ఈ వీడియో బయటకు రావడంతో రాజకీయంగా తీవ్ర కల కలం రేగింది. దీంతో ఆప్ కౌన్సిలర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై మంగళవారం మరోసారి విచారణ జరిపిన ధర్మాసనం అనిల్ మాసిహ్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే బ్యాలెట్ పేపర్లను కొట్టివేశారని మండిపడింది. ఈ క్రమంలో ఆ 8 ఓట్లను కూడా లెక్కలోకి తీసుకుని మరోసారి మొత్తం ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

# మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణ రెడ్డి బిగ్ ట్విస్ట్

## -రెండు నెలలక్రితం కాంగ్రెస్ లో చేరిన ఆయన తిరిగి వైఎస్సార్ పార్టీలో జాయిన్



అమరావతి ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణ రెడ్డి బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. వైఎస్ షర్మిల సమక్షంలో రెండు నెలలక్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో తిరిగి వైసీపీ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణా రెడ్డి రాజకీయంగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారుతున్నట్టు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకి చెప్పలేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు అన్ని కలిసి జగన్ ఓడించాలని చూస్తున్నాయని అన్నారు. " 2024లో వైసీపీ 175 సీట్లు గెలుస్తాం. 25 పార్లమెంట్ గెలుస్తాం" అని ఆయన దీమా వ్యక్తం చేశారు." నేను తిరిగి వైసీపీలో జగన్ దగ్గర చేరాను. పార్టీని 3వసారి గెలిపించడానికి పార్టీలో జగన్ దగ్గర చేరాను. పేదవాడు సంతోషంగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసి మైనార్టీల జీవితాల్లో జగన్ వెలుగులు నింపుతున్నారు. ఈ ప్రక్రియలో నేను రెండు నెలలు దూరంగా ఉన్నానగ. ఇప్పుడు తిరిగి పార్టీలో చేరాను. జగన్ ఇంకో 20, 30 సంవత్సారాలు అండగా నిలబడగలిగితే, ప్రజలు అండగా ఉంటే పేదలకు న్యాయం జరగుతుంది. వైనాట్ 175లో మేము కూడా భాగస్వామి కావాలి. 25 పార్లమెంటు స్థానాలు తిరిగి సాధించేందుకు కృషిచేస్తాను. మంగళగిరిలో ఏ అభ్యర్థిని ఇచ్చినా పూర్తిస్థాయిలో అన్ కండిషనల్‌గా పనిచేస్తానని జగన్‌కు చెప్పాను. ప్రతిపక్షాలు అన్ని కూడా రాజకీయంగా ఏకం అయ్యాయే అలానే నేటి పరిస్థితి ఉంది. జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో అన్‌కండిషనల్‌గా పనిచేస్తాను. 2019లో నారా లోకేశ్ ఎలా ఓడిపోయారో 2024లో బీసీ అభ్యర్థి చేతుల్లో నారాలోకేష్ ఓటమి చెందుతారు" అని అన్నారు.

# తలకిందులుగా తపస్సు చేసినా కేసీఆర్‌ను దగ్గరకు రానివ్వం

## - స్పష్టం చేసిన బీజేపీ ఎంపీ లక్ష్మణ్

నిర్మల్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బీఆర్ఎస్ కాళ్ల బేరానికి వచ్చినా రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీతో పొత్తు ఉండబోదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ స్పష్టం చేశారు. మంగళవారం భైంసాలో విజయ సంకల్ప సభలో మాట్లాడుతూ.. తలకిందులుగా తపస్సు చేసినా కేసీఆర్‌ను దగ్గరకు రానివ్వమన్నారు. "మజ్లిస్ పార్టీతో దోస్తాన్ చేసిన బీఆర్ఎస్‌కు బీజేపీ చాలా దూరంగా ఉంటుంది.ప్రధాని మోదీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి నక్కకు నాగ లోకానికి ఉన్న తేడా ఉంది. అయోధ్య రామ మందిర నిర్మాణ విషయంలో రాహుల్, సోనియా గాంధీలు హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. రాముడిని అవమానించే రీతిలో మాట్లాడి, ఆలయ నిర్మాణాన్ని హేళన చేశారు. ప్రస్తుతం ఓట్ల కోసం రామ నామ జపం చేస్తున్నారు. ఓబీసీ రిజర్వేషన్లను నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వ్యతిరేకించారు. ఎన్నికల్లో లబ్ది కోసం రాహుల్ ప్రస్తుతం ఓబీసీ రిజర్వేషన్ల అంశం తెరపైకి తెస్తున్నారు" అని లక్ష్మణ్ అన్నారు.

ఆహ్వానం

పుస్తక పరిచయ సభ

కొమ్మవరపు విల్సన్‌రావు కవితా సంపుటి

నాగలికూడా ఆయుధమే




తేది : 25 ఫిబ్రవరి 2024 ఆదివారం
ఉ॥ 9-30 గం॥ నుండి మ॥ 12.00 గం॥ల వరకు
వేదిక : మీటింగ్ హాల్, యు.టి.ఎఫ్. కార్యాలయం, శ్రీకాకుళం

ముఖ్య అతిథి : అట్టాడ అప్పల్నాయుడు, కథా రచయిత
విశిష్ట అతిథి : కలిమిశ్రీ, 'నవ మల్లెతీగ' మాసపత్రిక సంపాదకులు, విజయవాడ

పుస్తక పరిచయ ప్రసంగాలు :
డా॥ కె.జి. వేణు, కవి, రచయిత, నాటక కర్త, విశాఖపట్నం
డా॥ కె. ఉదయ్‌కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా॥ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటి, ఎచ్చెర్ల

ఆత్మీయ వాక్యాలు :
పాయల మురళీకృష్ణ
బాల సుధాకర మౌళి
కంచరాన భుజంగరావు
బాడాన శ్యామలరావు
పూజారి దివాకర్
వి.జి.కె. మూర్తి
నెట్టిమి రమణారావు
చింతాడ తిరుమలరావు
దాసరి రామచంద్రరావు

కవి స్పందన : కొమ్మవరపు విల్సన్ రావు, సృజనక్రాంతి దినపత్రిక సాహితీ సంపాదకులు, హైదరాబాద్
సభాధ్యక్షులు : కేతవరపు శ్రీనివాసు, కన్వీనర్
నిర్వహణ : కె. షణ్ముఖరావు, ఎస్. భవానీ ప్రసాద్

కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, విద్యార్థులకు ఇదే మా ఆహ్వానము.

సాహితీ స్రవంతి
శ్రీకాకుళం జిల్లా
సెల్ : 9490098811

# మూడోసారి మోడీ పీఎం అయితే.. ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్.. సీఎం హేమంత్ విశ్వ శర్మ



ఆదిలాబాద్, ఫిబ్రవరి 20:త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీజేపీకి పట్టం కడితే ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్ గా నిలుస్తుందని అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ విశ్వ శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం బాసర లో ప్రారంభమైన బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర భైంసాకు చేరుకున్న సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓబీసీ జాతీయ మోర్చ అధ్యక్షులు కే లక్ష్మణ్ హాజరై ప్రజల ఉద్దేశించి మాట్లాడారు.

మోడీ అభివృద్ధి పరిచిన జాతీయ రహదారులపైనే ప్రియాంక, రాహుల్ గాంధీ పాదయాత్రలు చేపడుతున్నారని ఆరోపించారు. విజయ సంకల్ప యాత్ర 5500 కిలోమీటర్ల మేర సాగనుందని, ఈ యాత్ర జయప్రదం చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మూడోసారి ముచ్చటగా మోడీనే ప్రధానమంత్రిగా చేసి, దేశం అభివృద్ధి పథంలో సాగాలనే ఉద్దేశంతో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణలో బీజేపీ రోజురోజుకు బలపడుతుందన్నారు. 2018 సంవత్సరంలో 6.8 శాతం ఓట్లు సంపాదించగా, 2023 లో 14.9 అయిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, వీళ్ల పాలన రజాకార్ల పాలనని, దీన్ని అంతం చేసే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. భారత ప్రజలు కాంగ్రెస్ ని తరిమికొట్టి మోడీని తీసుకొచ్చారని, మోడీ రామ మందిరాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం ప్రజలు మోడీని 3వ సారి ప్రధానిగా తీసుకురావాలని పిలుపునిచ్చారు. దేశంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత మోడీదేనని కొనియాడారు. తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోతుందని, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఊసే లేదన్నారు. అస్సాం రాష్ట్రంలో పెట్రోల్ 98 రూపాలు కాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ పై టాక్స్ వేసి 110 రూపాలకు ఇస్తూ ప్రజలపై భారాన్ని మోపి రక్తాన్ని తాగుతున్నారని ప్రజలను వేస్తున్నారని ఆయన దుయ్యబెట్టారు.

సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముగ్గురు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం వచ్చి అన్ని ఉచితంగా ఇస్తామని హామలిచ్చారు. ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. గతంలో రాహుల్ భారత్ జోడో యాత్ర నిర్వహిస్తే మూడు రాష్ట్రాలు గాలిలో కలిసాయని, ఇప్పుడు భారత్ జోడో యాత్ర నిర్వహిస్తున్నాడని, అయితే మొత్తం భారతదేశంలోనే కాంగ్రెస్ పార్టీ గాలిలో కలుస్తుందన్నారు. భారత్ యాత్రతో ఒరిగిందేమీ లేదన్నారు. అస్సాం ప్రజలు రాహుల్ భారత్ జూడో యాత్రను తిరస్కరించారన్నారు. నిర్మల్ శాసనసభ్యులు మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నుండి బీజేపీలోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యారని, ఎమ్మెల్యే తో పాటు ఫ్లోర్ లీడర్ అయ్యారన్నారు.

అలాగే తాను కూడా కాంగ్రెస్ పార్టీ నుండి బీజేపీ లోకి వచ్చి అస్సాంకు ముఖ్యమంత్రిని అయ్యానన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, మణిపూర్ మంత్రి నుసేంద్ర మెహార్, అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపూరావు, అదిలాబాద్ ప్రబారి అల్లాపూర్ శ్రీనివాస్, బస్సు యాత్ర ఇన్చార్జి దుగ్గాల ప్రవీణ్ రావు, నిర్మల్ జిల్లా ఇన్చార్జి పల్లె గంగారెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంజి కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, పవర్ రామారావు పటేల్, అదిలాబాద్ మాజీ జిల్లా పరిషత్ రెడ్డి, పల్లె గంగారెడ్డి, అయ్యన్న గారి భూమయ్య, రావుల రామనాథ్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, భీమ్రావు, సావలి రమేష్, తదితరులున్నారు.

# జమ్ము, కశ్మీర్‌లో 32,000 కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:ముప్పై రెండు వేల కోట్ల రూపాయల కు పైగా విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టుల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జమ్ము లో ఈ రోజు న ప్రారంభించి, వాటి ని దేశ ప్రజల కు అంకితమివ్వడం తో పాటు శంకుస్థాపన కూడా చేశారు. ఈ ప్రాజెక్టు లు ఆరోగ్యం, విద్య, రహదారులు, రైలు మార్గాలు, విమానయానం, పెట్రోలియమ్ మరియు పౌర ప్రయోజనాలు ప్రధానమైన మౌలిక సదుపాయాల కల్పన రంగం తో పాటు అనేక ఇతర రంగాల కు సంబంధించినవి. జమ్ము, కశ్మీర్ లో క్రొత్త గా ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తి చేసుకొన్న సుమారు 1500 మంది వ్యక్తుల కు నియామక ఉత్తర్వుల ను ప్రధాన మంత్రి అందజేశారు. 'వికసిత్ భారత్, వికసిత్ జమ్ము' కార్యక్రమం లో భాగం గా వేరు వేరు ప్రభుత్వ పథకాల యొక్క లబ్ధిదారుల తో ప్రధాన మంత్రి మాట్లాడారు.

కిశ్త్ వాడ్ జిల్లా కు చెందిన వీణా దేవి గారు తాను ఉజ్జ్వల యోజన యొక్క ప్రయోజనాల ను అందుకొన్నట్లు, దానితో తన జీవనం మెరుగు పడినట్లు ప్రధాన మంత్రి కి తెలియ జేశారు. ప్రస్తుతం తాను తన కుటుంబం కోసం మరియు స్వయం గా తన కోసం కాలాన్ని కేటాయించేందుకు వీలు చిక్కిందని ఆమె అన్నారు. ఇదివరకు వంట చేయడం కోసం అడవి లోకి వెళ్ళి వంట చెరకును తెచ్చుకొనేదాన్ని అని ఆమె తెలిపారు. తమ కుటుంబ సభ్యుల కు ఆయుష్మాన్ కార్డులు ఉన్నాయని ఆమె ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకు వచ్చి, ఈ కార్డుల జారీ కి గాను ప్రధాన మంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన మంత్రి మాట్లాడుతూ, వీణా దేవి గారు మరియు ఆమె కుటుంబ సభ్యులు చక్కని ఆరోగ్యం తో ఉండాలి అని ఆకాంక్షించారు.

రాష్ట్రీయ ఆజీవిక అభియాన్ లబ్ధిదారుల లో ఒకరైన కరువా నివాసి కీర్తి శర్మ గారు ప్రధాన మంత్రి తో మాట్లాడుతూ, ఒక స్వయం సహాయ సమూహం (ఎన్‌హెచ్‌జి) తో అనుబంధం కలిగి ఉన్నప్పుడు ఒనగూరే ప్రయోజనాల ను గురించి తెలియ జేశారు. ఆమె 30,000 రూపాయల రుణం తో తన వ్యాపార సంస్థ ను ప్రారంభించారు. ఒక లక్ష రూపాయల రెండో రుణాన్ని కూడా ఆమె స్వీకరించి, ఆ సొమ్ము తో మూడు గోవుల ను సమకూర్చుకొన్నట్లు వివరించారు. ఒక్క తమ స్వయం సహాయ సమూహమే కాకుండా జిల్లా అంతటా మహిళ లు వారి సొంత కాళ్ళ మీద వారు నిలబడగలుగుతారన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఆమె సభ్యురాలు గా ఉన్న సమూహం బ్యాంకు రుణాన్ని తిరిగి చెల్లించివేసింది; ప్రస్తుతం వారి వద్ద 10 గోవులు ఉన్నాయి. ఆమె మరియు ఆమె గ్రూపు సభ్యులు అనేక ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి ని కూడా పొందారు. మూడు కోట్ల మంది లఖ్‌పతి దీదీ ల (లక్షాధికారి సోదరీమణుల)ను సిద్ధం చేయాలి అనే లక్ష్యం తో ప్రధాన మంత్రి చేపట్టిన ఈ ప్రాజెక్టు కు తమ పూర్తి సహకారాన్ని అందిస్తాం అంటూ ఆమె హామీ ని ఇచ్చారు.

పూంచ్ ప్రాంత రైతు శ్రీ లాల్ మొహమ్మద్ ప్రధాన మంత్రి తో మాట్లాడుతూ, తాను ఒక సరిహద్దు ప్రాంత నివాసి ని అని పరిచయం చేసుకొన్నారు. తన కు ఒక చిన్న మట్టితో కట్టిన ఇల్లు ఉండేదని, సరిహద్దు కు అవతలి వైపు నుండి ఇంటి మీదకు తుపాకి గుండ్లు దూసుకు వస్తూ ఉండేవన్నారు. పక్కా ఇంటి ని కట్టుకోవడం కోసం పిఎమ్ ఆవాస్ యోజన లో భాగం గా 1,30,000 రూపాయలు అందాయని, ప్రస్తుతం తాను ఆ విధం గా కట్టుకొన్న ఇంట్లో తలదాచుకొంటున్నానని శ్రీ లాల్ మొహమ్మద్ ప్రధాన మంత్రి కి చెప్తూ, ఆయన కు తన ధన్యవాదాల ను తెలియ జేశారు. ప్రభుత్వం యొక్క పథకాలు దేశం లో సుదూర ప్రాంతాల కు చేరుకొంటూ ఉండడం పట్ల ప్రధాన మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు. శ్రీ లాల్ మొహమ్మద్ కు పక్కా ఇల్లు సమకూరినందుకు అభినందనల ను తెలియ జేశారు. శ్రీ లాల్ మొహమ్మద్ తన వంతు గా ప్రధాన మంత్రి ని ప్రశంసిస్తూ, 'వికసిత్ భారత్' ఇతివృత్తం ప్రధానం గా సాగిన ఒక రెండు పంక్తుల ను వినిపించారు.

బాందీపురా కు చెందిన శహీనా బేగం గారు ఒక స్వయం సహాయ సమూహం (ఎన్‌హెచ్‌జి) లో సభ్యురాలు. ప్రధాన మంత్రి తో ఆమె మాట్లాడుతూ, సమాజ శాస్త్రం లో తాను స్నాతకోత్తర పట్టా ను సాధించినప్పటికీ నిరుద్యోగం కారణం గా ఎన్నో ఇబ్బందుల ను ఎదుర్కోక తప్పలేదు అంటూ వివరించారు. 2018వ సంవత్సరం లో ఆమె స్వయం సహాయ సమూహం లో చేరారు. తేనెటీగల పెంపకం వ్యాపారాన్ని ప్రారంభించడం కోసం ఆమె రుణాన్ని స్వీకరించారు. ఆ తరువాత నేశనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిశన్ యొక్క సహాయాన్ని అందుకొని, ఆ వ్యాపారాన్ని మరింత గా విస్తరించారు. దీనితో ఆమె తాను ఎంచుకొన్న రంగం లో గుర్తింపు ను తెచ్చుకొని, ఒక లఖ్‌పతి దీదీ (లక్షాధికారి సోదరీమణి)గా ఎదిగారు. ప్రధాన మంత్రి ఆమె కు అభినందనల ను తెలియ జేసి, మారుమూల గ్రామాల లో ఉండే మహిళ లు లఖ్‌పతి దీదీ లు గా మారేందుకు వారికి లభిస్తున్న అవకాశాల ను సంతోషం తో అందుకొంటున్నారు అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. శహీనా బేగం గారు ప్రేరణ ను పొందారు అని ఆయన అన్నారు. ఆమె తిరిగి మాట్లాడుతూ, కోళ్ళ పెంపకం వ్యాపారం కోసం కిసాన్ క్రెడిట్ కార్డు తాలూకు ప్రయోజనాల ను వినియోగించుకొన్నట్లు వెల్లడించారు. ఆమె ను స్నాతకోత్తర స్థాయి వరకు చదివించిన ఆమె తల్లితండ్రుల ను ప్రధాన మంత్రి కొనియాడారు. శహీనా బేగం లో శ్రమ పట్ల గల సమర్పణ భావం ప్రశంసనీయం అని కూడా ఆయన అన్నారు. మహిళ లు వారు కన్న కలల ను నెరవేర్చుకోవడం తో పాటు సాధికారిత దిశ లో పయనించడాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, "మోదీ యొక్క హయాం లో ప్రతిదీ సాధ్యమే." అన్నారు.

జల్ జీవన్ మిశన్ లబ్ధిదారుల లో పుల్‌వామా కు చెందిన శ్రీ రియాజ్ అహమద్ కోలీ ఒకరు. ప్రధాన మంత్రి తో ఆయన మాట్లాడుతూ, తమ పల్లె లో ప్రతి ఒక్క ఇంటి కి నల్లా నీరు అందుతోందని, ఇది తన కుటుంబ సభ్యుల జీవనం లో ఒక పెనుమార్పు ను తీసుకు వచ్చిందన్నారు. తమ గ్రామం లోని మహిళ ల ఆశీర్వాదాల ను ఆయన ప్రధాన మంత్రి కి తెలియ జేశారు. 370వ అధికరణం రద్దు అయిన తరువాత ఆయన ఆయనకు ఉన్న భూమి యొక్క హక్కుల ను చేజిక్కించుకొన్నారు. దీని తో ఆయనతో పాటు ఆయన కు చెందిన ఆదివాసి సముదాయం లోని ఇతర సభ్యులు కూడా ఎంతగానో లాభపడ్డారు. ప్రధాన మంత్రి ఒక రాజకీయ కార్యకర్త గా తాను ఉన్న రోజుల ను తలచుకొంటూ గుజ్జర్ సముదాయం అందించినటువంటి ఆతిథ్యం పట్ల ప్రశంస ను వ్యక్తం చేశారు.

సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, జమ్ము కు ఇదివరకు తాను వచ్చిన సందర్భాల తో పోలిస్తే ఈ రోజు న ప్రజలు ప్రతికూల వాతావరణ స్థితి లో సైతం ఉత్సాహం గా పెద్ద సంఖ్యల లో తరలి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద తెర ల మీద చూడడం కోసం మూడు వేరు వేరు సభా ప్రాంగణాల వద్ద జమ్ము పౌరులు భారీ సంఖ్యల లో గుమికూడారు అని కూడా ఆయన తెలియ జేశారు. జమ్ము, కశ్మీర్ ప్రజల లోని ఉత్సాహాన్ని శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ, ఈ రోజు న జరుగుతున్న కార్యక్రమాన్ని ఒక దీవెన అని అభివర్ణించారు. ఈ రోజు న జరుగుతున్న కార్యక్రమం వికసిత్ భారత్ కే పరిమితం కాదు, మరి దీనిలో దేశవ్యాప్తం గా వేరు వేరు విద్య సంస్థల కు చెందిన వారు లక్షల సంఖ్య లో పాలుపంచుకొంటున్నారు అని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమాన్ని జమ్ము, కశ్మీర్ లో ఉన్న 285 బ్లాకుల లోని పౌరులు చూస్తున్నారని, ఆయన చెప్తూ, ఈ కేంద్ర పాలిత ప్రాంతం యొక్క ప్రజల లో వ్యక్తం అవుతున్న ఉత్సాహాన్ని ఆయన మెచ్చుకొన్నారు.

ప్రధాన మంత్రి తనతో సంభాషించిన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల వల్ల సమకూరుతున్న లాభాల ను గురించి వారి భావాల ను సూటి గాను, స్పష్టం గాను వ్యక్తం చేసిన తీరు ను ప్రశంసించారు. వికసిత్ భారత్ వికసిత్ జమ్ము, కశ్మీర్ మరియు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లంటే జమ్ము, కశ్మీర్ ప్రజల లో వ్యక్తం అవుతున్నటువంటి భావన కు గాను ప్రధాన మంత్రి వారికి అభినందనల ను తెలియ జేశారు. ప్రతి లబ్ధిదారు యొక్క ఇంటి ముంగిట కు చేరుకోవాలి అనేదే ప్రభుత్వం యొక్క నిబద్ధత అని ఆయన పునరుద్ఘాటించారు. అర్హత ఉన్న లబ్ధిదారుల ను ఎవ్వరి ని అయినా వదలి వేసే ప్రసక్తే లేదు అంటూ ఆయన హామీ ని ఇచ్చారు. "మీ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. మనం వికసిత్ జమ్ము, కశ్మీర్ ను ఆవిష్కరించి తీరుతాం. 70 సంవత్సరాలు గా నెరవేరని కలల ను మోదీ త్వరలోనే నెరవేర్చుతాడు" అని ప్రధాన మంత్రి అన్నారు.

# బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ముంబైలో

## నేడు 2వ పరిశ్రమల ముఖాముఖి నిర్వహించనున్న బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:దేశంలో స్థిరమైన ఇంధన భద్రత కల్పించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం, బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ (బొగ్గు/లిగ్నైట్ నుంచి ఇంధన వాయువుల ఉత్పత్తి) ప్రాజెక్టులను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ దిశగా, ఈ నెల 16న హైదరాబాద్‌లో పరిశ్రమల ముఖాముఖిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ విజయవంతంగా నిర్వహించింది. ఇప్పుడు, ముంబైలో, ఈ నెల 21న మరో రోడ్‌షో నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను దేశవ్యాప్తం గా వృద్ధి చేయడం, విస్తృత పరచడం ఈ రోడ్‌షోల లక్ష్యం.దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చేలా బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ఒక పథకాన్ని ఆమోదించింది. ఆ పథకం ప్రకారం, బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు 3 విభాగాల కింద బొగ్గు మంత్రిత్వ శాఖ రూ.8,500 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందిస్తుంది. ఆ విభాగాలు ప్రభుత్వ పీఎస్‌యూలు, ప్రైవేట్ సంస్థలు, చిన్న తరహా ప్రాజెక్టులు.

బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల వల్ల ఇంధన వనరుల వైవిధ్యీకరణ, దిగుమతులపై తక్కువగా ఆధారపడటం, శుద్ధ ఇంధన సాంకేతికతల ద్వారా పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉంటాయి. ఇంధన రంగంలో ఆవిష్కరణలు, సహకారాన్ని పెంచడంలో బొగ్గు మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఈ చొరవ స్పష్టం చేస్తుంది. అంతేకాదు, పరిశ్రమ వర్గాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా గ్యాసిఫికేషన్ సాంకేతికతల అమల్లో వేగం పెంచడానికి, బొగ్గు/లిగ్నైట్ ఆధారిత ఇంధన పరిష్కారాల కోసం ఒక బలమైన వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఈ ముఖాముఖి ద్వారా ఒకే వేదికపైకి రానున్న విధాన రూపకర్తలు, పరిశ్రమ పెద్దలు, పెట్టుబడిదార్లు కలిసి బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ రంగంలో అవకాశాలు, సవాళ్లపై చర్చిస్తారు. ఆహూతులంతా తమ అభిప్రాయాలు, ఉత్తమ విధానాలను పంచుకుంటారు. భారతదేశంలో గ్యాసిఫికేషన్ కార్యక్రమాలను పెంచే కొత్త మార్గాల గురించి ఆలోచిస్తారు.

భారతదేశం స్థిరంగా వృద్ధి చెందేలా, ఇంధన భద్రత లక్ష్యాలను సాధించేలా బొగ్గు/లిగ్నైట్ వనరుల అపారమైన సామర్థ్యాన్ని బొగ్గు గ్యాసిఫికేషన్ అందుబాటులోకి తెస్తుంది. ఆసక్తి గల వాటాదార్లంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆహ్వానిస్తోంది.

# పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినీలను సిద్ధం చేయాలి

### - అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్



ఖమ్మం, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినీలను సిద్ధం చేయాలని, ఎలాంటి వత్తిడికి గురికాకుండా పరీక్షలు అంటే భయం పోగెట్టెల ఉపాధ్యాయులు వారికి తెలియజేయాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతిని సందర్శించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. వారికి విద్యాబోధన చేసి వారి సందేహాలను నివృత్తి చేశారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారి విద్యా ప్రమాణాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నది పరిశీలించారు. అనంతరం కిచెన్ షెడ్ వంట వస్తువులు, కూరగాయలు, సరుకుల వివరాలు, విద్యార్థులకు ప్రతిరోజు అందించే మెనూను ఆయన పరిశీలించారు. కస్తూరిభా గాంధీ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఉన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈఈ

సూర్యాపేట, ఫిబ్రవరి 20: గ్రామాల్లో విద్యుద్దీపాలను అమర్చినందుకు గాను తనకు రావల్సిన డబ్బులను అడిగిన బాధితుడి నుంచి లంచం తీసుకున్న పంచాయతీరాజ్ ఏఈఈ ని అవినీతి నిరోధక అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా మెల్లచెరువు మండలంలో పంచాయతీ రాజ్ ఏఈఈగా పనిచేస్తున్న కొసురి రంగరాజు మంగళవారం బాధితుడు దరావత్ కృష్ణ నుంచి రూ.5 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో దరావత్ కృష్ణ విద్యుద్దీపాలను అమర్చాడు. ఇందుకు సంబంధించిన ఎంబీ బుక్స్ ఇవ్వాలని కోరగా అందుకు ఏఈఈ లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారులు వలవేసి మంగళవారం లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని అరెస్టు ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

# నల్గొండలో 26న మెగా జాబ్ మేళా..

నల్గొండ, ఫిబ్రవరి 20: నల్గొండ స్థానిక నిరుద్యోత యువతకు గుడ్ న్యూస్.. ఈ నెల 26వ తేదీన నల్గొండలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. 100కు పైగా కంపెనీలు 5 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జాబ్ మేళా పోస్టర్ ను నల్గొండ కలెక్టర్ హరిచందన సోషల్ మీడియా ఎకౌంట్‌లో విడుదల చేశారు. ఫిబ్రవరి 26న నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హరిచందన ప్రకటించారు.

# అభివృద్ధి నిల్.. అవినీతి ఫుల్ .. జగన్‌పై లోకేష్ ధ్వజం

అమరావతి, ఫిబ్రవరి 20:మూడు రాజధానుల పేరిట మన జీవితాలతో మూడు ముక్కలాట ఆడుతున్నారని వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని విమర్శించారు.

అనకాపల్లి జిల్లా మాడుగులలో మంగళవారం జరిగిన శంఖారావం సభలో లోకేశ్ మాట్లాడు తూ, "మరో రెండు నెలల్లో టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా చూసే బాధ్యత తనదని. ఐదేళ్లుగా యువతకు ఉద్యోగ అవకాశాలు లేవని. విశాఖకు పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమ లు తీసుకొస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. పరిశ్రమలు తీసుకురావడం కాదు.. ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి. పాలిచ్చే ఆవును వదులుకుని.. తన్నే దున్నపోతును తెచ్చుకున్నాం. వైసీపీ ప్రభుత్వం తన్నే దున్నపోతు..తెలుగుదేశం పాలు ఇచ్చే ఆవు. ఇక్కడి నుంచి వైసీపీ మంత్రి బూడి ముత్యాలనాయుడిని గెలిపిస్తే.. ఉత్తరాంధ్రకు ఆయనేం చేశారు?ఐదేళ్లలో ఒక్క చోటైనా రోడ్డు వేశారా.. ఒక్క గుంత అయినా పూడ్చారా.. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి నిల్.. అవినీతి ఫుల్. ఇష్టమొచ్చినట్లు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. టీడీపీ -జనసేనను గెలిపించండి.. అభివృద్ధి ఏంటో చూపిస్తాం. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా.. ప

నిచేసేవాళ్లనే ప్రోత్సహిస్తాం. ప్రజల్లో ఉంటూ పనిచేసే వారిని వెతుక్కుంటూ వచ్చి నామినేటెడ్ పోస్టులు ఇస్తాం. బాబు సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి" అని లోకేశ్ అన్నారు.

# సిపిని కలిసిన సిపిఐ నాయకులు



ఖమ్మం, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) నాయకులు మంగళవారం ఖమ్మం సిపి సునీల్ దత్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా శాంతి భద్రతలు సహా పలు విషయాలపై చర్చించారు సీపీని కలిసిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి టి. రామానీజనేయులు తదితరులు.

# రావూరి సైదాబాబును కలిసిన కాంగ్రెస్ నేతలు



ఖమ్మం, ఫిబ్రవరి 20:(నేటనిజం ప్రతినిధి): మంగళవారం రఘునాథపాలెం మండలం వి.వెంకటాయ పాలెం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ గా రావూరి సైదాబాబు, వైస్ చైర్మన్ గా రావెళ్ల శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 27న సెంట్రల్ బ్యాంక్ చైర్మన్, వి.వెంకటాయపాలెం సొసైటి చైర్మన్ కూరాకుల నాగభూషణం పై పదకొండు మంది డైరెక్టర్లు అవిశ్వాన తీర్మానం ప్రవేశపెట్టిన విషయం విదితమే,

అట్టి తీర్మానం పై చైర్మన్ కూరాకుల నాగభూషణం హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా ఈ నెల పద్నాలుగవ తారీకున ఆ పిటిషన్ ను హైకోర్టు కొట్టి వేసింది అనివార్యంగా చైర్మన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. దీనితో ఖాళీ అయిన చైర్మన్ స్థానానికి, వైస్ చైర్మన్ స్థానానికి అధికారులు ఎన్నిక నిర్వహించగా మొత్తం పదమూడు మంది సభ్యులకు గాను పదిమంది సభ్యులు మద్దతు తెలపడంతో రావూరి సైదాబాబు చైర్మన్ గా, రావెళ్ల శ్రీనివాసరావు వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ప్రక్రియకు మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో సహా ముగ్గురు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు కార్పొరేటర్లు చావా నారాయణరావు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మందడపు మనోహర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కమతం రామకృష్ణ, తోట ప్రసాద్, జొన్నలగడ్డ రవికుమార్, చంద్ర రాంబాబు, నెల్లూరి కోటేశ్వరరావు, నల్లమల ఆనంద్, సంక్రాంతి నాగేశ్వరరావు, శాఖమూరి రమేష్, జూకూరి గోపాలరావు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గెలిచేది మనమే.. అందరికీ ప్రాధాన్యం: పవన్ కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 20:అసెంబ్లీలో అడుగుపెట్టటమే.. లక్ష్యం, ఇందుకు త్యాగాలు తప్పవు, అధికారంలోకి వచ్చేది మనమే..పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికి ఫలితం ఉంటుంది, ఎవ్వరికి అన్యాయం జరగదు. మనకు ఉన్న లక్ష్యం ఒకటే.. అసెంబ్లీ మన గళం వినిపించటమే అని జన సైనికులకు జనసేనాని ఉద్బోధించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మంగళవారం రాజమండ్రిలోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం ఈ సమావేశం ప్రారంభం కాగా.. రాజమండ్రి రూరల్, రాజమండ్రి అర్బన్, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ముఖ్య నాయకులతో పవన్కళ్యాణ్ భేటీ అయ్యారు. ఆయా నియోజవర్గాల్లో ఉమ్మడి పార్టీలు జనసేన, టీడీపీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి నియోజకవర్గం నుంచి 15 మంది పైగా జనసేన నాయకులపు పిలిపించి పవన్ కళ్యాణ్ క్షుణ్ణంగా సమీక్ష జరిపారు. ఈ ఎన్నికల్లో గెలిచేది మనమే, సీట్లు రాలేదని బాధవద్దు. అధికారంలోకి వస్తాం. కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యం ఖాయం, నామినేటెడ్ పదవుల్లో జనసైన్యానికే ఎక్కువ అవకాశాలు ఉంటాయని పవన్ కళ్యాణ్ హితబోధ చేసినట్టు సమాచారం. అదే విధిగా ఉమ్మడి పార్టీల విజయంలో జనసైన్యం కీలక పాత్రను , ఎన్నికల విధి విధానాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు..

# టీటీడీ ట్రస్టులకు రూ.43 లక్షల విరాళం



తిరుపతి, ఫిబ్రవరి 20:బెంగళూరుకు చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకుడు వర్ధమాన్ జైన్ టీటీడీ లోని పలు ట్రస్టులకు 43 లక్షలు విరాళంగా అందించారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఈ మేరకు విరాళం డీడీలను టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డికి దాత శనివారం అందజేశారు. ఇందులో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ. 33. 33 లక్షలు, ఎస్వీబీసీ ట్రస్టుకు రూ. 10.11 లక్షలు అందించారు.

### భక్తిభావాన్ని పంచిన విష్ణుసహస్రనామ స్తోత్ర అఖండ పారాయణం

భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల నాదనీరాజనం వేదికపై మంగళవారం టీటీడీ చేపట్టిన విష్ణుసహస్రనామ స్తోత్ర అఖండ పారాయణం భక్తిభావాన్ని పంచింది. పలువురు భక్తులు నేరుగా పాల్గొనగా, వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ సందర్భంగా తిరుమల వేద విజ్ఞాన పీఠం ఆచార్యులు కోగంటి రామానుజాచార్యులు, మారుతి, అనంతగోపాలకృష్ణ అఖండ పారాయణం చేశారు. విష్ణు సహస్రనామ స్తోత్రం 108 శ్లోకాలను మూడు సార్లు పారాయణం చేశారు.

# ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలి -బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 20: విద్యాశాఖలో రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ లను రెగ్యులరైజ్ చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మానసిక వైకల్యం తో బాధపడుతున్న విద్యార్థులకు గత పది సంవత్సరాలుగా విద్యను ఐఈఆర్పీలు అందిస్తున్నారని తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, అందుకు అవసరమైన పోస్టులను రెగ్యులర్ డీఎస్సీలో పొందుపర్చకుండా ఇతర ప్రక్రియ ప్రారంభమైందని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయాలని చూస్తున్న తరుణంలో వీరిని రెగ్యులరైజ్ చేయాలని సూచించారు.

ప్రస్తుతం సేవలందిస్తున్న 996 మంది ఐఈఆర్పీలను రెగ్యులరైజ్ చేసి మిగిలిన పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయాలని కోరారు. కాంట్రాక్టు విధానంలో పనిచేసిన జూనియర్ లెక్చరర్ , డిగ్రీ లెక్చరర్ లను రెగ్యులరైజ్ చేసినందున వీరిని కూడా రెగ్యులరైజ్ చేయడానికి ఎలాంటి అడ్డంకులు ఉండకపోవచ్చని ఆయన పేరొన్నారు. ప్రభుత్వంలో ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో చొరవ చూపాలని కోరారు.

# నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి మా విధానం బహిరంగంగా, పారదర్శకంగా మరియు సంప్రదింపులతో ఉంది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు జల్ శక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ సోమవారం ముంబై టెక్ వీక్ సందర్భంగా అనంత్ గోయెంకాతో జరిగిన చర్చలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ రెగ్యులేటరీ ల్యాండ్‌స్కేప్‌పై మాట్లాడుతూ టెలికాం వంటి క్లిష్టమైన రంగాలలో గత పాలనతో పోలిస్తే నరేంద్ర మోదీ ప్రభుత్వం యొక్క పరివర్తన విధానాన్ని వివరించారు.

మంత్రి తన 12 సంవత్సరాల విస్తృతమైన వ్యవస్థాపక అనుభవాన్ని ప్రతిబింబిస్తూ "టెలికాం రంగంలో కొన్ని అతిపెద్ద స్కామ్‌లు జరిగాయి. కాబట్టి, ప్రభుత్వం నియంత్రణ గురించి మాట్లాడేటప్పుడు విరక్తి మరియు సంశయవాదానికి సంబంధించిన అంశాలు కూడా ఉంటాయి. ఎందుకంటే నియంత్రణ అనేది ఒక నిర్దిష్ట ఎజెండా కోసం లేదా ప్రభుత్వం లేదా రాజకీయ నాయకుడు నియంత్రించాల్సిన అవసరాన్ని ముందుకు తెస్తుందనే భావన ఉంది. కానీ నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి మా విధానం బహిరంగంగా, పారదర్శకంగా మరియు సంప్రదింపులతో ఉంది. వాటాదారులందరూ కలిసి రావడం మరియు మన ఆర్థిక వ్యవస్థలోని ఏదైనా విభాగం యొక్క క్రమబద్ధమైన వృద్ధికి ముఖ్యమైన గార్డ్‌రైల్‌లను సృష్టించడం మా ప్రభుత్వ విధానం. ఇది కేవలం ఆవిష్కరణల గురించి అయితే అది కేవలం వ్యవస్థాపకులు తమ పనిని చేయడం గురించి అయితే మరియు కొన్ని నియమాలు, చట్టాలు మరియు కాపలాదారులు లేకుంటే మీరు గందరగోళానికి గురవుతారు" అని తెలిపారు.

ముఖ్యంగా సెమీకండక్టర్స్‌లో చైనాతో పోలిస్తే భారతదేశం అభివృద్ధి చెందుతున్న ప్రపంచ స్థితిని స్పృశిస్తూ మంత్రి చంద్రశేఖర్ తన ప్రసంగంలో గణనీయమైన మార్పును వివరించారు.

"చైనా పరంగా గమనిస్తే అభివృద్ధి చెందుతున్న మరియు హైటెక్ రంగాలలో గత దశాబ్దంలో వారు ఊపందుకున్నారు. కానీ నేడు పలు ఎగుమతి నియంత్రణ విధానాల కారణంగా వృద్ధి మందగిస్తున్న ధోరణి నేడు ఉంది. టెక్ భవిష్యత్తులో వారు ఖచ్చితంగా విశ్వసనీయ భాగస్వామిగా చూడబడరు. గత 75 ఏళ్లలో కోల్పోయిన అవకాశాలను భారతదేశం తిరగరాస్తోందని నేను నమ్మకంగా చెప్పగలను. దశాబ్దాల తర్వాత దేశంలోకి ఏ10 బిలియన్ల ఫ్యాబ్ పెట్టుబడులు రావడంతో ఈరోజు మనకు రెండు పూర్తిస్థాయి ఫ్యాబ్‌లు ఉన్నాయి. మనం సెమీకండక్టర్ల భవిష్యత్తు కోసం సాంకేతికత కోసం ఉత్తమ భాగస్వాములతో కూడా భాగస్వామ్యం చేస్తున్నాము. కాబట్టి సెమీకండక్టర్స్‌పై డిజైన్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో పాటు, తదుపరి తరం చిప్‌లు మరియు పరికరాలను రూపొందించబోతున్నాము. ఇండియా సెమీకండక్టర్ రీసెర్చ్ సెంటర్‌ను కూడా ప్రారంభిస్తున్నాము. ఇది ప్రపంచంలోని అతిపెద్ద సెమీకండక్టర్ తయారీదారులు చేసే అత్యాధునిక పరిశోధనా కేంద్రం కానుంది "అని మంత్రి వివరించారు.

చివరిలో ర్యాపిడ్ ఫైర్ ఇంటరాక్షన్ సందర్భంగా ప్రభుత్వ సేవలు మరియు ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏఐని గరిష్టంగా ఉపయోగించుకునేలా చూస్తుందని మంత్రి చెప్పారు.

శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ "ఆర్థిక వృద్ధి లక్ష్యాలను సాధించడం కోసం ఏఐని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని మేము భావిస్తున్నాము, ఆరోగ్య సంరక్షణ మరియు ఔషధ ఆవిష్కరణలతో పాటు వ్యవసాయం మరియు రైతు ఉత్పాదకతపై ఏఐ పెద్ద ప్రభావాన్ని చూపుతుందని నిర్ధారిస్తుంది. చాట్‌జిపిటితో పోటీ పడేందుకు హక్కులు కలిగి ఉండటమే వినియోగ కేసులు కాదు. మనం వెళ్లే దిశ అది కాదు. మనం కూడా ముందుకు వెళ్తాము మరియు విద్యకు మద్దతు ఇస్తాము మరియు భారతదేశంలోని బహుళ భాషలు మరియు బహుళ డేటాసెట్‌లపై దృష్టి పెడతాము " అని మంత్రి స్పష్టం చేశారు.

# బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు కాంగ్రెస్ పార్టీ సృష్టే : బండి సంజయ్



హైదరాబాద్, ఫిబ్రవరి 20: బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు కాంగ్రెస్ పార్టీ సృష్టి అని బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ బండి సంజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ పలు ఆరోపణలు చేసిందని గుర్తు చేశారు.

బీజేపీ బీఆర్ఎస్‌తో రహస్యంగా పొత్తు కుదుర్చుకుందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడారని సంజయ్ పేర్కొన్నారు. తాండూరులో విజయ సంకల్ప బస్సు యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

-లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని సంజయ్ తెలిపారు. ఒంటరిగానే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడుతామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో పార్టీ కూడా కచ్చితమైన నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక స్థానాల్లో గెలిపించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ తెలిపారు.

# జయలలిత బంగారు ఆభరణాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలి

## -కర్ణాటకలోని బెంగళూరు కోర్టు కీలక తీర్పు

బెంగళూరు ఫిబ్రవరి 20 (ఎక్స్‌ప్రెస్ న్యూ స్);కర్ణాటకలోని బెంగళూరు కోర్టు కీలక తీర్పు వెలువరించింది. తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత కు సంబంధించిన బంగారు ఆభరణాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆభరణాల అప్పగింతకు మార్చి 6, 7 తేదీలను ఖరారు చేసింది. ఆ రెండు రోజుల్లో ఆభరణాలను తీసుకెళ్లేందుకు ఆరు ట్రంకు పెట్టెలతో రావాలని తమిళనాడు ప్రభుత్వాన్ని బెంగళూరులోని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. మొత్తం 27 కేజీల బంగారు, వజ్రా భరణాలతో పాటు, 700 కేజీలకుపైనే వెండిని ప్రభుత్వానికి అప్పగించనుంది. బంగారు ఆభరణాలు తీసుకోవడానికి ఒక అధికారిని నియమించినట్లు న్యాయస్థానం తెలిపింది. తమిళనాడు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐజీపీ ఆ అధికారితో సమన్వయం చేసుకోవాలని సూచించింది. కోర్టు నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకునే సమయంలో ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్, ఆరు పెద్ద ట్రంకు పెట్టెలు, అవసరమైన భద్రత సిబ్బందితో రావాలని ఆదేశించింది. నగలను తమిళనాడు రాష్ట్రానికి అప్పగిం చేందుకు ఆ రెండు రోజుల్లో స్థానిక పోలీసులతో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. అదేవిధంగా.. ఈ కేసులో తమిళనాడు ప్రభుత్వం.. కర్ణాటకకు లిటిగేషన్ ఫీజుగా రూ.5 కోట్లు చెల్లించాలని ఆదేశించి ంది.తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత అటు రాజకీయాల్లోనూ, ఇటు సినిమాల్లో తనదైన ముద్ర వేసింది. తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఈమెకు లెక్కకు మించి ఆస్తులున్నాయనే విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో అక్రమార్జన కేసులో 1996లో చెన్నైలోని జయ నివాసం నుంచి అధికారులు పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత అక్రమ కేసులో జయ దోషిగా తేలడంతో 2014లో బెంగళూరు కోర్టు నాలుగేళ్లు జైలు శిక్ష, రూ.100 కోట్లు జరిమానా విధించింది. అలాగే స్వాధీనం చేసుకున్న వస్తువులను ఆర్బీఐ, ఎస్బీఐ లేదా బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని స్పష్టం చేసింది. అయితే ఇంతలోనే జయలలిత మరణించారు. ఈ క్రమంలోనే దీనిపై మరోసారి విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు ఆ ఆభరణాలను తమిళనాడు ప్రభుత్వానికి బదిలీ చేయాలని నిర్ణయించింది. జయలలిత చరాస్తులు, స్థిరాస్తులను వేలం వేయడమే ప్రత్యేక కోర్టు ప్రస్తుత విచారణలో ఉంది. ఆభరణాలను వేలం వేసిన తర్వాత కోర్టు ఆమె స్థిరాస్తులను వేలానికి తీసుకురానుంది.

కర్ణాటక ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వస్తువులు..

అక్రమార్జన కేసులో 1996లో చెన్నైలోని జయ నివాసం నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతోపాటు పలు వస్తువులన్నీ కర్ణాటక ప్రభుత్వం ఆధీనంలోనే ఉన్నాయి. అందులో 7 కిలోల బంగారు, వజ్రా భరణాలు, 700 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటితోపాటు ఖరీదైన చెప్పులు, పట్టుచీరలు, వీడియో క్యాసెట్లు, లాకర్లతోపాటు పలు వస్తువులు కూడా ఉన్నాయి. అదేవిధంగా అమ్మకు సంబంధించిన రూ,1.93 లక్షల నగదు కూడా ఉంది. వీటన్నింటినీ తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని కర్ణాటకలోని బెంగళూరు కోర్టు తాజాగా నిర్ణయించింది.

# రూ.1100కోట్ల మెఫెడ్రోన్ డ్రగ్ స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:మహారాష్ట్ర పూణెలో పోలీసులు 1.75 కిలోల మెఫెడ్రోన్ డ్రగ్ ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. మార్కెట్‌లో మెఫెడ్రోన్ ధర రూ.3.85 కోట్ల వరకు ఉంటుందని అంచనా. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. మరో రెండు గోదాములను గుర్తించారు. అందులో 55 కిలోల ఎండీని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని విచారించి.. ఇన్‌పుట్స్ ఆధారంగా కుర్కుంభ్ మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాంతంలో మరో ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో 550 కిలోల ఎండీని స్వాధీనం చేసుకున్నట్లు పుణే పోలీస్ కమిషన్ అమితేశ్ కుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఎండీ డ్రగ్ విలువ రూ.1100కోట్ల వరకు ఉంటుందని అధికారులు వివరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సత్యనారాయణ గౌడ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

## -తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ డిమాండ్




హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్‌ప్రెస్ న్యూ స్) :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన సత్యనారాయణ గౌడ్ అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. అక్రమాలపై అవగాహన ఉన్నదని తప్పుడు కూతలు కూస్తూ వాస్తవాలను దాచే ప్రయత్నం చేస్తున్నాడని తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ సభ్యుడు, ఐపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి మహేష్ కుమార్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి, ఉపాధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా లు తీవ్రంగా విమర్శించారు. సత్యనారాయణ గౌడ్ స్థాయి అటెండర్ నుంచి టెక్నికల్ అసిస్టెంట్ అయిన ఇతడు ఉద్యోగంకు రాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన గురించి చెప్పే అంత స్థాయా అతనిది కాదని, అక్రమంగా పెట్టిన బోర్డులను రెవిన్యూ అధికారులు తొలగిస్తే, ప్రైవేటు వ్యక్తులు తొలగించారని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్య బట్టారు.మంగళవారం ఐపీఎం కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మార్వో మల్లయ్య, ఆర్ ఐ రాంబాబు కూలగొట్టడం నిజం కాదా అని ప్రశ్నించారు. వారిని మేనేజ్ చేసి కూలగొట్టిన బోర్డులను వెంటనే తొలగించి దాచేయలేదా?ఉద్యోగస్తుల నుంచి డబ్బులు అక్రమంగా, మోసం చేసి వసూలు చేసిన నీవు కించపరిచినట్లు మాట్లాడినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేసారు. లేదంటే తెలంగాణ ప్రజలు ప్రభుత్వ ఉద్యోగస్తులు కాంగ్రెస్ కార్యకర్తలు భాగ్యనగర అసోసియేషన్ పనిపాడతారని హెచ్చరించారు.

# కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవం సంతోషదాయకం.. ఎంపీ అరవింద్




నిజామాబాద్, ఫిబ్రవరి 20: ప్రధాని మోడీ చేతుల మీదుగా కేంద్రీయ విశ్వవిద్యాలయం వర్చువల్‌గా ప్రారంభించుకోవడం సంతోషదాయకమని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపి విద్యలో ఉన్నత మార్కులు వచ్చేలా చొరవ చూపాలన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఖిల్లా మినీట్యాంక్ బండ్ వద్ద నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ జమ్మూ కాశ్మీర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ? దేశానికి ప్రధాని మోడీ అయ్యాక ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు జరిగిందని తెలిపారు. రూ.22 కోట్లతో కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనాన్ని మన దేశ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. కోవిడ్ వల్ల భవన నిర్మాణ పనులు కొద్దిగా ఆలస్యమైందని చెప్పారు.. నయా పైసా కమిషన్ లేకుండా పూర్తిగా రూ.22 కోట్లతో ఈ విద్యాలయం ప్రారంభించుకున్నామని తెలిపారు. 441మంది విద్యార్థులు ఈ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నమోదు చేసుకున్నారని, త్వరలో సెక్షన్-2 కూడా ప్రారంభించుకుంటామని తెలిపారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రెండవ సెక్షన్ కి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా పదవ తరగతి అనంతరం ఆపై తరగతులు కూడా నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు.పిల్లలు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా తల్లిదండ్రులు వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు పాటించి, టైం టేబుల్ నియమించాలన్నారు. జమ్మూ కాశ్మీర్ లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని జమ్మూ కాశ్మీర్ స్వస్థలాన్ని వదిలి వెళ్ళిన వారు తిరిగి 40 సంవత్సరాల తర్వాత వారి స్వస్థలానికి వచ్చేలా ప్రధాని మోడీ కృషిచేసి వారికి సొంత ఇళ్ళు నిర్మించి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలతో.. సంపూర్ణ ఆయుష్షుని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఎంపీ అరవింద్ కోరారు. కేంద్ర విశ్వవిద్యాలయంలో సరస్వతీ మాత విగ్రహ ఏర్పాటుకి అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ముందుకు రావడంపై అభినందించారు.

# ఉద్యమకారుల గుండెలపై తుపాకి ఎక్కుపెట్టిన వ్యక్తి సీఎంగా ఉన్నారు : హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 20:తెలంగాణ ఉద్యమానికి శక్తినిచ్చిన నియోజకవర్గం షాద్‌నగర్ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ పోరాటంలో షాద్‌నగర్ ప్రజలు ఉద్యమ స్ఫూర్తిని చాటారని ప్రశంసించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా ఉద్యమంలో ముందునిలిచి పోరాడారని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు.కానీ, నేడు తెలంగాణ ఉద్యమ కారులపై తుపాకి ఎక్కుపెట్టిన వ్యక్తి సీఎంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరఫున కొట్లాడుదామన్నారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణకు రక్ష అని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో సాగు, తాగునీటి కష్టాలు.. నీటి పారుదల శాఖ మంత్రి నియోజకవర్గంలో రైతుల నిరసన



సూర్యాపేట, ఫిబ్రవరి 20: తెలంగాణలో సాగు, తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. తాగునీరు లేక తడిగొంతులు ఆరిపోతున్నాయి. కాంగ్రెస్ పాలనలో అటు అన్నదాతలు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వరి పంటకు నీళ్లు అందడం లేదని నీటి పారుదల శాఖ మంత్రి నియోజకవర్గంలో అన్నదాతలు నిరసనకు దిగారు. ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు నిలబడి తమ నిరసనను వ్యక్తం చేశారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రాష్ట్ర కేబినెట్‌లో నీటి పారుదల శాఖ మంత్రిగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి మండలంలోని కల్మలపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద ఆయకట్టులో నీటి కొరత ఉందని రైతులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌కు క్రాప్ హాలిడే ప్రకటించడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

అయితే కొందరు రైతులు బోర్లపై ఆధారపడి వరిసాగు చేపట్టారు. కానీ బోర్లు కూడా ఎండిపోవడంతో.. వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. కనీసం సాగర్ లెఫ్ట్ కెనాల్ నుంచైనా నీరు విడుదల చేస్తే పంటలు బతికే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ, నాగార్జున సాగర్, హుజూర్‌నగర్, కోదాడ అసెంబ్లీ సెగ్మెంట్లలోని పంటలను కాపాడేందుకు సాగర్ ఎడమ కాల్వకు తక్షణమే నీటిని విడుదల చేయాలని రైతులు ప్రభుత్వాన్ని, నీటిపారుదల శాఖ మంత్రిని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతు ఆత్మహత్యలు తప్పవని, నీటి పారుదల శాఖ మంత్రి చొరవ తీసుకుని సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించాలని కోరారు.

# 1,600 పోస్టులు ఖాళీ.. అవికూడా భర్తీ చేయాలి : ఆర్. కృష్ణయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:గ్రూప్-1 నోటిఫికేషన్‌లో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు, బీసీ ఉద్యమ నేత ఆర్. కృష్ణయ్య ఆరోపించారు.

ఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం రాష్ట్రంలో 1,600 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, కానీ కేవలం 563 పోస్టులను భర్తీ చేయడం కోసమే నోటిఫికేషన్ జారీ చేశారని వెల్లడించారు.

కొత్త జిల్లాలు, మండలాలు, మునిసిపాలిటీలు ఏర్పడ్డాక పాలనా వ్యవస్థలో అధికారులు, సిబ్బంది అవసరం పెరిగిందని తెలిపారు. ఐఏఎస్ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి పెరిగిన ఉద్యోగాలను గుర్తించి వాటిని వెంటనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. అలాగే 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. నిరుద్యోగుల ఆందోళనతో ప్రభుత్వాలే మారాయని, ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు దృష్టిలో పెట్టుకోవాలని హితవు పలికారు.

# సృజనాత్మకను వెలికితీసేందుకే ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

## -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19,20 తేదీల్లో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ మొదటి రోజు సిరిసిల్ల నియోజక వర్గంలో రెండవ రోజు వేములవాడ నియోజకవర్గ పరిధిలో నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరిక్ష రాశారు.

ఈ పరీక్ష గత 10 సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో నిష్ణాతులైన వారిచే ప్రశ్నాపత్రం రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ టాలెంట్ టెస్ట్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేళ ఎస్ఎఫ్ఐ నిర్వహించే టాలెంట్ టెస్ట్ విద్యార్థుల మెదళ్ళ మానసిక అభివృద్ధికి ఉత్ప్రేరకంగా ఉంటుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు చదువుల్లో రాణించాలని, 10వ తరగతి ఉజ్వల భవిష్యత్తుకు తొలిమెట్టు అన్నారు. మండల స్థాయిలో జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, మోహన్, ప్రవీణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసిన డీపీఆర్ఓ



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీ శ్రీధర్.. ప్రభుత్వ విప్, వేములవాడ ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విప్ కు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన డీపీఆర్ఓ కు ఆది శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పథకాల సమాచారం ప్రజలకు చేరవేయాలని సూచించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి వెంట పౌర సంబంధాల శాఖ ఏడీ దశరథం తదితరులు ఉన్నారు.

# వేములవాడలో సినీ నటుడు సుమన్ సందడి

## -ఎల్లమ్మ గౌడ నిత్యాన్నదాన సత్రం ప్రారంభించిన సుమన్



వేములవాడ, ఫిబ్రవరి 20: వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డు బ్రిడ్జి వద్దగల అఖిలభారత శ్రీ రాజరాజేశ్వరి రేణుక ఎల్లమ్మ గౌడ నిత్య అన్నదాన సత్రంను లో ప్రముఖ సినీ నటుడు సుమన్ సోమవారం ప్రారంభించారు. వేములవాడకు విచ్చేసిన సుమన్ కు గౌడ సంఘ సభ్యులు, ట్రస్ట్ చైర్మెన్ మహంకాళి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ట్రస్ట్ ను ప్రారంభించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. హీరో సుమన్ తో సెల్ఫీలు దిగడానికి పట్టణవాసులు ఎగబడడంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. అనంతరం వారు మాట్లాడుతూ మహాకాంలి శ్రీనివాస్ పేదల ఆకలి తీర్చాలి అనే ఉద్దేశ్యంతో నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు కార్యక్రమంలో వ్యవస్థాపక చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రాజు గౌడ్, గౌరవ అధ్యక్షులు రామ్మోహన్ గౌడ్, సలహాదారులు పద్మ గౌడ్, కలర్ సత్తన్న గౌడ్, సురగౌని రవి గౌడ్ బలగం దేవయ్య గౌడ్ నేరెళ్ల నరేష్, మహిపాల్ , రవితో పాటు గౌడ కార్యకర్తలు పాల్గొన్నారు.


అక్షరయాన్
తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్
నిర్వహణలో
అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సంబురం
ముఖ్య అతిథి : మాన్యశ్రీ సిహెచ్.విద్యాసాగర్ రావు గారు, పూర్వ గవర్నర్, మహారాష్ట్ర
ఆత్మీయ అతిథి : శ్రీమతి జొన్నలగడ్డ స్నేహజ గారు, రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్, హైదరాబాద్
విశిష్ట అతిథి : 'లోక కవి' శ్రీ అందెశ్రీ గారు, పంపకవి పురస్కార గ్రహీత
అధ్యక్షులు : అయినంపూడి శ్రీలక్ష్మి అక్షరయాన్ వ్యవస్థాపకురాలు
సాదర స్వాగతం
21 ఫిబ్రవరి 2024, ఉ॥ 10.00 గం॥లకు
టూరిజం ప్లాజా హోటల్, బేగంపేట్, హైదరాబాద్


# ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 20:ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా చూస్తామని మాజీ, మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్అన్నారు. మంగళవారం రాంగోపాలపేట్ డివిజన్‌లోని పీజీ రోడ్డులో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను స్థానికులు తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అదే విధంగా డిమ్మా పాన్‌షాపు నుంచి రామ మందిరం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే పనులు చేపడతామని చెపారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, జీహెచ్ఎంసీ, జలమండలి అధికాంులు, స్థానిక నాయకులు కిశోర్, శ్రీహరి, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

# ఓయో వ్యాపారంపై విచారణ చేస్తాం : రోనాల్డ్ రాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 20:జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశాలు వాడీవేడీగా కొనసాగుతున్నాయి. మంగళవారం పన్నుల వసూళ్లపై కౌన్సిల్లో కార్పొరేటర్లు చర్చను లేవనెత్తారు. పన్నుల వసూళ్లపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌వివరణ ఇచ్చారు. చట్టప్రకారమే నగరంలో పన్నులు వసూలు చేస్తున్నామని తెలిపారు.ఓయో వ్యాపారంపై విచారణ చేసి పన్నులు వసూలు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే సెల్లార్ పార్కింగ్‌పై పోలీస్, జీహెచ్ఎంసీ కలిసి సర్వే చేస్తావ ున్నారు. కాగా, నిన్నటి సమావేశాల్లో ప్రకటనలపై పూర్తి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌కు మేయర్ గద్వాల విజయలక్ష్మిఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# మరాఠా కోటాను స్వాగతించిన ఉద్ధవ్ ఠాక్రే

ముంబై, ఫిబ్రవరి 20: మహారాష్ట్ర అసెంబ్లీలో మరాఠా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడాన్ని శివసేన (యుబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్వాగతించారు. మరాఠా రిజర్వేషన్ల కోసం త్యాగాలు చేసిన మరాఠాలను ఆయన అభినందించారు. సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును పరిశీలించిన తర్వాత ఇది అసెంబ్లీలో ఆమోదం పొందినా కోర్టులో పెండింగ్‌లోనే ఉందని వ్యాఖ్యానించారు.

విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించే మరాఠా కోటా బిల్లు ఆమోదం పొందినందుకు తాను ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానని ఠాక్రే పేర్కొన్నారు. మరాఠా కోటా కోరుతూ నిరసన చేపట్టిన అంతర్వాలి గ్రామంలో లాఠీచార్జ్ చేశారని దీని గురించి తాను ఈరోజు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని అన్నారు.

ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఈ రిజర్వేషన్ అమలవుతుందని అన్నారు. ప్రభుత్వానికి మరాఠా కోటా విషయంలో తాము మద్దతిస్తామని, అయితే కోటా కింద ఎంతమందికి ఉద్యోగాలు లభించాయనేది ప్రభుత్వం వెల్లడించాలని అన్నారు. ఈ దిశగా కొంత సమయం వరకూ తాము వేచిఉండాల్సిన అవసరం ఉందని శివసేన (యుబీటీ) చీఫ్ ఠాక్రే వ్యాఖ్యానించారు.

# నేటితో ముగియనున్న డీఎస్సీ ఫీజు చెల్లింపు గడువు..

అమరావతి, ఫిబ్రవరి 20:ఏపీలో టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ఫిబ్రవరి 12న నోటిఫికేషన్లు వెలువడింది. కాగా.. ఫిబ్రవరి 22తో గడువు ముగియనుంది. అయితే 21లోగా నిర్ణీత పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. మార్చి 15 నుంచి 30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఆయా తేదీల్లో ప్రతిరోజూ ఉదయం విడత 9.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 31న ప్రిలిమినరీ ఆన్సర్ కీని విడుదల చేసి ఏప్రిల్ 3 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తదనంతరం ఏప్రిల్ 8న ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేసి, ఏప్రిల్ 15న ఫలితాలు వెల్లడించనున్నారు.

ఏపీ డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 6100 ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీల్లో ఎస్జీటీ-2280 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్-2299 పోస్టులు, టీజీటీ -1264 పోస్టులు, పీజీటీ -215 పోస్టులు, ప్రిన్సిపల్-42 పోస్టులు ఉన్నాయి. ఏప్రిల్ 31 వరకు రాబోయే ఖాళీలనూ పరిగణనలోకి తీసుకొని, ఈ పోస్టులను ప్రకటించారు.

డీఎస్సీలో ఎంపికైన వారికి జూన్ 8న పోస్టింగులు ఇవ్వనున్నారు. వీటిలో జిల్లా పరిషత్/మండల పరిషత్ / మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పోరేషన్ పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (గురుకులం), ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ (ఆశ్రమ్), ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిటూ ్యషన్ సొసైటీ, మహాత్మా జోతిబాపూలే బీసీ గురుకులాల్లో టీచర్ పోస్టులను భర్తీచేయనున్నారు.నిరుద్యోగులకు గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లు కాగా.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా ఐదేళ్ల సడలింపు, దివ్యాంగులకు 54 ఏళ్లుగా వయోపరిమితి నిర్ణయించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాలను ఏపీతో పాటు పక్క రాష్ట్రాల్లో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, బరంపూర్‌లో కేటాయించారు. ఆన్‌లైన్ పరీక్షలను రోజుకు రెండు విడతల్లో నిర్వహిస్తారు.

# పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి

## -రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్ రాజ్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఏప్రిల్ 1, 2024 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి కానున్న ప్రతి యువత ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు రూపొందించిన తుది జాబితా విడుదల తర్వాత ఆయా జిల్లాలలో భారీగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు కొరకు దరఖాస్తులు రావటం పై వికాస్ రాజ్ ఆరా తీశారు. పార్లమెంట్ ఎన్నికలకు తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బంది వివరాలు తీసుకొని ఎపిక్ నెంబరుతో సహా ఆన్లైన్ లో వివరాలు నమోదు చేయాలనీ తెలిపారు. పోస్టల్ ఓటుకు ఈ వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి మాట్లాడుతూ తుది ఓటరు జాబితా ప్రచురించి అన్ని పోలింగ్ స్టేషన్లు, రాజకీయ పార్టీలకు పంపించడం జరిగిందన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డుల ముద్రణకు పంపడం జరిగిందని పోస్ట్ ద్వారా వారి ఇంటికి చేరుతాయని తెలిపారు. ఒకవేళ ఎవరిదైనా ఎపిక్ కార్డు పోగొట్టుకొని ఉంటే వారు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. చనిపోయిన ఓటర్లు, లేదా డూప్లికేట్ ఓటర్లు ఉంటే సంబధిత బి.ఎల్. ఒ లకు లేదా తహశీల్దార్లు ఫారం 7 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఇప్పటికే ఈ.వి.యం మొదటిస్థాయి పరిశీలన పూర్తి చేసుకోవడం జరిగిందని ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్ కుమార్, మధుసూదన్, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస చారి, ఏపీడీ నర్సింహులు, తహశీల్దార్ షరీఫ్ మోహినొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి బిడ్డ పెండ్లికి ప్రభుత్వ విప్ 'ఆది' ఆర్థికసాయం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20:(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాన్ గొప్ప మనసును చాటుకున్నాడు.

కథలపూర్ మండలం తుర్తి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన వెంగల రాధ-సురేష్ దంపతుల కుమార్తె హారిక వివాహం ఈనెల 29న కరీంనగర్ లో జరగనుంది. నిరుపేద కుటుంబం కావడంతో ఆమె వివాహానికి తన వంతు సాయంగా రూ.10వేల ఆర్థిక సాయం అందించి, అండగా నిలిచాడు. ఆది శ్రీనివాస్ సూచన మేయార్కు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తుం మధు, కనికరపు రాకేష్, ఖమ్మం గణేష్, హరీష్ ఇతర నాయకులు వేములవాడ పట్టణంలోని 12వ వార్డ్ సాయి నగర్ లో నివాసం ఉంటున్న హారిక తల్లిదండ్రులకు నగదు అందజేశారు.

ఈ సందర్భంగా యువతి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో అండగా నిలిచిన 'ఆది'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ గంగపుత్ర జేఏసీ ఘనంగా భీష్మపితమ జయంతి



హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గంగపుత్రుల ఆరాధ్య దైవం భీష్మపితమ జయంతి పురస్కరించుకొని కాచిగుగలో తెలంగాణ గంగపుత్ర జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఏ.సుదర్శన్ నేతృత్వం లో భీష్మపితమ కు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. బెష్మని స్ఫూర్తి ని ప్రతి ఒక్కరు ఆరశంగా తెసుకొని నియమ నిబద్దతకు కట్టుబడి ఉండాలని,సమసమాజ స్థాపనకు కృషి చేయాలనీ సుదర్శన్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర్యక్రమం లో వెంట్ట ముత్యాలు,గౌట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారం పట్టివేత

ముంబయి, ఫిబ్రవరి 20: ముంబయి ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ అధికారులు భారీగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల రెండు మూడురోజుల వ్యవధిలో 17 వేర్వేరు కేసుల్లో 9.83 కిలోల బంగారంతో పాటు ఐఫోన్లు, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని బట్టలు, ప్లాస్టిక్ ప్లేట్లు, టాంగ్ పౌడర్, క్యాబిన్ బ్యాగుల్లో పెట్టి తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టుకున్న బంగారం విలువ రూ.5కోట్లకుపైగా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడ్డారా? బంగారాన్ని ఎక్కడికి తరలిస్తున్నారు ? అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు కస్టమ్స్ వర్గాలు తెలిపాయి.

ఇదిలా ఉండగా.. ఈ నెల 12 నాటికి విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు రూ.12 కోట్లకుపైగా విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 9 నుంచి 11 మధ్య విమానాశ్రయ కస్టమ్స్ కమిషనరేట్ అధికారులు రూ.97లక్షల విలువైన 1.76 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3న మరో కేసులో దుబాయి నుంచి వచ్చిన భారతీయ ప్రయాణికుడి నుంచి నుంచి ప్రయాణిస్తున్న భారతీయుడి నుంచి కస్టమ్స్ అధికారులు రూ.1.43కోట్ల విలువన గోల్డ్ డస్ట్, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చాక్లెట్ బాక్సుల్లో, బేబీ పౌడర్ కంటైనర్లలో చాకచక్యంగా బంగారాన్ని దాచి తరలిస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు వివరించారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.